


# విజయభాను


హైదరాబాద్, గురువారం 24-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 343 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## పోల్ సీన్ ప్రశాంతం

- బరిలో నిలిచిన అభ్యర్థులు 15మంది
- 28న ఓట్ల లెక్కింపు
- మొత్తం ఓటర్లు 2,18,858
- పోలింగ్‌లో పాల్గొన్న వృద్ధమహిళలు, అంధులు
- స్వేచ్ఛగా ఓటు వేసేందుకు భారీ బందోబస్తు



కర్నూలు: రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్న నంద్యాల నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ కొద్దిసేపటి క్రితం ప్రారంభమయింది. సాయంత్రం ఆరు గంటల వరకు 2,18,858 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటువేసేందుకు నియోజకవర్గ మంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల భద్రత బాధ్యతను ప్రత్యేకించి కేంద్ర పారామిలిటరీ బలగాలకు అప్పగించారు. టీడీపీ తరపున భూమా నాగిరెడ్డి అన్న కుమారుడు బ్రహ్మానందరెడ్డి, వైసీపీ తరపున మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి అబ్దుల్ ఖాదర్, రాయలసీమ పరిరక్షణ సమితి అభ్యర్థి భవనాశి పుల్లయ్య సహా 15 మంది బరిలో ఉన్నారు. ఈ నెల 28న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

**నంద్యాల ఉప ఎన్నిక ప్రశాంతంగా జరగాలి..**

నంద్యాల ఉప ఎన్నిక ప్రశాంతంగా జరగాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఆయన తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. భార్య, కుమారుడు, కోడలు, కుమార్తె సహా శిల్పా పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. నంద్యాల సంజీవ్‌నగర్ బూత్ నెంబర్ 81లో ఓటు వేశారు.

అనంతరం శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్‌ను ఎన్నికల కమిషన్ పూర్తి చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గత రాత్రి కూడా తమ ఇంటిపై దాడులు చేశారని ఆయన తెలిపారు. పౌరులంతా స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనాలని శిల్పా మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ దౌర్జన్యాలకు ఓటు రూపంలో జవాబు చెప్పాలన్నారు.

**జగనన్న సీఎం కావాలి**



శిల్పా మోహన్ రెడ్డి తనయుడు రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. అధికార పక్ష వైఖరిని ప్రజలంతా గమనిస్తున్నారు. ప్రశాంత వాతావరణాన్ని చెడ

తరువాయి 2లో

## ఖైరతాబాద్ గణపతి
# తొలిపూజకు గవర్నర్



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి తొలి పూజకు రాష్ట్ర గవర్నర్ నరసింహన్ హాజరుకానున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఈనెల 25న ఉదయం 10 గంటలకు తొలి పూజను తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దంపతులు చేయనున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నేతృత్వంలో గణేష్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ సుదర్శన్, స్థానిక రాజకీయ పార్టీల ఐకాస నాయకులు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. తొలి పూజకు హాజరయ్యేందుకు గవర్నర్ అంగీకరించారని ఆ తర్వాత ఉత్సవ కమిటీ తెలిపింది. గవర్నర్‌ను కలిసిన వారిలో వివిధ పార్టీల నాయకులు ప్రేమ్‌రాజ్, మహేష్‌యాదవ్, మహేందర్‌బాబు, ఆవుల అనీల్‌కుమార్, వంశీకృష్ణ, నగేష్, రంజిత్ ఉన్నారు. మరో వైపు ఖైతరాబాద్ మహా గణపతి దాదాపు సిద్ధమయ్యాడు. తుది మెరుగులూ దిద్దుకోవడంతో అప్పుడే భక్తుల సందర్శన మొదలైంది. విగ్రహానికి పూర్తిగా రూపం ఇచ్చేలా కళ్లకు మాత్రం రంగులద్దాల్సి ఉంది. బుధవారం సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయనున్నట్లు విగ్రహ శిల్పి రాజేంద్రన్ తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు, బక్రీద్ వేడుకలకు గట్టి బందోబస్తు



కరీంనగర్: గణేష్ నవరాత్రోత్సవాలు, బక్రీద్ పండుగల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కరీంనగర్ రేంజ్ డీఐజీ సి.రవివర్మ పోలీసులు అధికారులను ఆదేశించారు. గణేష్ మండపాల వద్ద పటిష్ట బారికేడ్లు ఏర్పాటు తరువాయి 2లో

## గాంధీ ఆస్పత్రిలో గవర్నర్ నరసింహన్‌కు సర్జరీ



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌కు గాంధీ ఆస్పత్రిలో చికిత్స జరిగింది. బుధవారం మధ్యాహ్నం గవర్నర్ కుడి కాలి పాదానికి గాంధీ వైద్యులు సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం గవర్నర్ గాంధీ ఆస్పత్రిని పరిశీలించారు. కాగా ఏమైనా వైద్యం చేయించుకోవాల్సి వస్తే గాంధీ ఆస్పత్రికే వస్తానని ఇది వరకే గవర్నర్ ప్రకటించిన తెలిసిందే.

## సెప్టెంబర్‌లో రూ.200 నోటు..!




ముంబయి: అక్రమ నగదు చలామణి.. నకిలీ కరెన్సీ నోట్లకు అడ్డుకట్ట వేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 200 నోట్లను ముద్రిస్తున్న విషయం తెలిసిందే. ఈ కొత్త నోటు ఆగస్టు నెలాఖరులో లేదా సెప్టెంబర్ తొలి తరువాయి 2లో

## తరగతి గదులు 10లోపు పూర్తి కావాలి

### కలెక్టర్ యోగితారాణా



గన్‌ఫౌండ్రి: సర్వశిక్షా అభియాన్ ద్వారా చేపట్టే సివిల్ పనులను నిర్ణీత గడువులోపు పాలసీ ప్రకారం పూర్తి చేయాలని, ప్రతి పనికి టెండర్ల ఖరారు, పరిపాలన మంజూరీ తదితర కారణాలతో కాలయాపన చేస్తే ఇకపై సహించబోమని హైదరాబాదు జిల్లా కలెక్టర్ యోగితారాణా ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ ఇంజినీర్లకు స్పష్టం చేశారు.

సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్, సంబంధిత ఇంజినీర్లతో పాఠశాలలు, పనుల వారీగా కలెక్టరేట్‌లో ఆమె సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ లక్ష నుంచి 2 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే చిన్న పనులను కూడ టెండర్ల సాకుతో పూర్తి చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. వ్యవధిని ముందే ఖరారు చేసుకొని పూర్తి చేయాలన్నారు. 144 అదనపు తరగతి గదుల పనులను సెప్టెంబరు 10వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సరళకు సూచించారు.

**ఆహార వివరాలు ప్రదర్శించండి**

ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందచేయాల్సిన ఆహారాన్ని తప్పనిసరిగా ప్రచార పత్రికపై ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాలపై ఆయా శాఖల అధికారులతో విద్యార్థుల ఆహారం, మౌలిక వసతుల అంశాలపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే పరీక్షల గ్రేడింగ్‌ను కూడ సంబంధిత వసతి గృహాలలో ప్రదర్శించాలన్నారు.

## భాజపాలోనే కొనసాగుతా



అమరావతి: తాను తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఆంధ్రప్రదేశ్ వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఖండించారు. తనకు పార్టీ మారే యోచన లేదని.. చివరి వరకు భాజపాలోనే కొనసాగుతానని స్పష్టం తరువాయి 2లో






## టేకిట్ ఈజీ



నైతిక బాధ్యత వహించి రాజీనామా చేస్తారట మంత్రిగారు.. మరి మీ సంగతి!!

### వరుస రైలు ప్రమాదాలు
## నైతికంగా బాధ్యత వహిస్తా రాజీనామా చేస్తా



న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లో నాలుగు రోజుల వ్యవధిలో రెండు రైలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో దీనికి బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు రాజీనామా చేసేందుకు సంసిద్ధులయ్యారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీని సురేష్ ప్రభు కలిశారు. యూపీలో రెండు ప్రమాదాలు జరిగాయి. రాజీనామా చేస్తానని సురేష్ ప్రభు చెప్పగా.. తరువాయి 2లో

### రాజస్థాన్ సర్కార్‌పై
## రాబర్ట్ వాద్రా ఫైర్



న్యూఢిల్లీ : బికనీర్ భూ ఒప్పందంపై సీబీఐ విచారణకు రంగం సిద్ధమవుతున్న క్రమంలో రాబర్ట్? వాద్రా రాజస్థాన్ సర్కార్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. తనను టార్గెట్‌గా చేసుకుని రాజస్థాన్ ప్రభుత్వం వేధిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూ కుంభకోణంలో తన ప్రమేయం ఉన్నట్టు ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించలేదని వాద్రా అన్నారు.

'నన్ను ఎంతైనా వేధించండి... వెంటాడండి... తరువాయి 2లో

# విజయనగర కాల్వలకు నీరు విడుదల

## ఆయకట్టు రైతుల్లో ఆనందం



గంగావతి : తుంగభద్ర జలాశయం కుడి, ఎడమ ప్రాచీన విజయనగర కాల్వలకు నీటిని విడుదల చేశారు. దీంతో సాగునీటి కోసం గత కొంత కాలంగా ఆందోళన చేస్తున్న ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కాల్వలకు నీరు విడుదల జాప్యం కావడంతో మరోసారి జాతీయ రహదారి-50పై రాస్తారోకో చేసేందుకు పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. నీటిపారుదల శాఖ అధికారులు ఆందోళనకు నేతృత్వం వహిస్తున్న తమ్మినీడి జనార్దన్, విశ్వనాథరాజు తదితరులను పిలిపించుకుని చర్చించారు. ప్రస్తుత నీటి లభ్యత ఆధారంగా విజయనగర కాల్వలకు ఐ.సి.సి. సమావేశంలో 4 టి.ఎం.సి.లు కేటాయించినందున తమకు సాగునీరు విడుదల చేయాలని వీరు అధికారులను కోరారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కొప్పళ శాసనసభ్యుడు రాఘవేంద్ర హిట్నాళ, జడ్పీ అధ్యక్షుడు రాజశేఖర్ హిట్నాళ, తమ్మినీడి జనార్దన్‌లు నింగాపుర క్రాస్‌కు వచ్చి నీటి విడుదలకు అధికారులు అంగీకరించినట్లు రైతులకు సమాచారం అందించారు. ఎడమ కాల్వ 11ఎ ఉపకాలువ దాకా నిత్యం 150 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తారన్నారు. అనంతరం రైతులతో తరలివెళ్లి కాల్వకు నీరు విడుదల చేయించారు. నీరు చైన్ 28 వద్దకు చేరుకోగానే రైతులు తండోపతండాలుగా వెళ్లి వీక్షించారు.

## బెళ్లందూరు చెరువుకు కాంగ్రెస్ పేరు పెట్టండి

బెంగళూరు : కలుషిత కాసారం బెళ్లందూరు చెరువుకు కాంగ్రెస్‌గా నామకరణం చేయాలని నవభారత్ ప్రజాస్వామిక పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ కార్యకర్తలు చెరువు అలుగు వద్ద పలకలు చేతపట్టి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యుల మాస్క్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. బెళ్లందూరు చెరువు నాశనమయ్యేందుకు కాంగ్రెస్, భాజపా పాలకులు కారణమని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. జాతీయ హరిత న్యాయ పంచాయతీ పలుమార్లు హెచ్చరికలు చేసినా కాలుష్య నిర్మూలనకు చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. చెరువు నీరు కలుషితం కావడానికి కారణమైన పరిశ్రమలు, బహుళ అంతస్తుల భవనాలను మూసి వేయాలని ఆదేశించినా, వాటిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదని ఆ పార్టీ నేత భారత్ విరుచుకుపడ్డారు. చిన్నపాటి వానకే నురగ బయటకు వస్తుందని, దీనివల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం

సిమిలిగుడ : విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటి గుర్తింపు సాధించడం ప్రశంసనీయమని వి.ఎస్.విద్యాలయం ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ సెఠి అన్నారు. సునాబెడ హాల్ టౌన్‌షిప్‌లోని వి.ఎస్.విద్యాలయానికి చెందిన విద్యార్థులు గత నెలరోజుల్లో జరిగిన నృత్యం, క్విజ్ పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించారు. విజేతలుగా నిలిచిన వారికి సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీల్లో నృత్య విభాగంలో దివ్యశ్రీ సాహు ప్రథమ బహుమతి సాధించారు. మరో వైపు ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీలో పాల్గొన్న ఉపేంద్రకుమార్‌రౌత్, కె.ప్రదిన్ కుమార్‌లు విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే హాల్ స్పోర్ట్స్‌క్లబ్ ద్వారా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ క్రీడాకారులుగా సుమిత్‌బసంత్ పటేల్, ఇటీవల ముగిసిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో పరేడ్ పోటీల్లో ఉత్తమ జట్టుగా ఇదే విద్యాలయానికి బహుమతి లభించడంలో వారందరినీ ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. విద్యార్థులు సునాబెడ కీర్తిని నిలిపారని ప్రశంసించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు షేక్ ఇబ్రహీమ్ అధ్యక్షత వహించారు.

## త్వరలో ఐఐటీలో 'బ్యాటరీ ఇంజినీరింగ్ కేంద్రం'




వేళచ్చేరి : మద్రాసు ఐఐటీలోని సెంటర్ ఆఫ్ బ్యాటరీ ఇంజినీరింగ్‌ను ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ అశోక్ లేల్యాండ్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఐఐటీ మద్రాసు వేదికగా ఆ సంస్థతో ఎంఓయూ కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రానున్న అయిదేళ్లలో ఈ కేంద్రానికి అవసరమయ్యే రూ. 1.5 కోట్లను అశోక్ లేల్యాండ్ అందించనుంది. బ్యాటరీ ఇంజినీరింగ్‌లో ముఖ్యంగా విద్యుత్తు వాహనాలు, తత్సంబంధిత అంశాలపై పరిశోధన, అభివృద్ధికి ఈ ఒప్పందం తోడ్పడగలదని ఐఐటీ సంచాలకులు ప్రొఫెసర్ భాస్కర్ రామమూర్తి పేర్కొన్నారు. సంబంధిత పరిశ్రమతో కలిసి ఇలాంటి కేంద్రాన్ని నెలకొల్పడం ఐఐటీలలో ఇదే ప్రథమమని వెల్లడించారు. అశోక్ లేల్యాండ్ విద్యుత్తు వాహనాల తయారీ విభాగం అధినేత కార్తిక్ ఆత్మనాథన్, భాస్కర్ రామమూర్తి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

## బ్యాంకు ఉద్యోగాలు వదులుకుంటారేం?




సపేటె : బ్యాంకింగ్ రంగంలో చాలా ఉపాధి అవకాశాలు ఉన్నాయి. కాని ఎవరూ ఆ రంగం పట్ల ఆసక్తి చూపటం లేదని హంపీ కన్నడ విశ్వవిద్యాలయం ఆచార్య మోహన్ కుంటార్ విచారం వ్యక్తం చేశారు. వర్సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో ఉపాధి అవకాశాలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక్క కర్ణాటకలోనే బ్యాంకింగ్ రంగంలో 16 వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. కాని ప్రతిఒక్కరూ ఇంజి నీరింగ్, వె%ద్య కోర్సుల పట్ల మక్కువ చూపిస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల వారు బ్యాంకింగ్ రంగంలో ఉపాధి పొందుతున్నారు. బ్యాంకుల్లో ఇతర రాష్ట్రాల వారే ఎక్కువగా ఉన్నారు. ఆ అవకాశం జారవిడుచు కోవద్దని సూచించారు. సాధారణ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ నిపుణత ఉంటే ఖచ్చితంగా బ్యాంకుల్లో ఉద్యోగం దొరుకుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. బెంగళూరుకు చెందిన అశోక్ హెగ్డే,డాక్టర్ మల్లికా ఘంటి, కులసచివుడు పాండురంగబాబు పాల్గొన్నారు.

## డిమాండ్ల పరిష్కారానికి 108 సిబ్బంది ఆందోళన

బరగఢ్ : దీర్ఘకాలంగా నెలకొన్న మా డిమాండ్లు పరిష్కరించాలంటూ బరగఢ్ జిల్లా 108 అంబులెన్సు సిబ్బంది వాహనాలు నిలిపివేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ 12 డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేస్తుండగా సంఘ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ సాహును బలంగీర్‌లో తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేశారని ఆయనను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లాకి చెందిన 13 అంబులెన్సులను రాత్రి బరగఢ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిలిపివేసి సిబ్బంది దీక్షలో పాల్గొన్నారు. ఈ మేరకు సమస్యలపై కలెక్టర్ ఖగేంద్రనాథ్ పాఢికి వినతిపత్రం అందించారు. సిబ్బందికి సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లు అందులో పేర్కొన్నారు. అంబులెన్సు సేవలు నిర్వహిస్తున్న జెడ్‌హెచ్‌ఎల్ సంస్థ ఎండీ దీపక్ శ్రీవాస్తవ్ ఉద్యోగులపై నియంతృత్వంగా వ్యవహరించడం దారుణమన్నారు. పశ్చిమ ఒడిశాలోని 11 జిల్లాల్లో అంబులెన్సు సేవలు నిలిచిపోయాయి.

## పండుగ కళ వచ్చేసింది!



నగరంలో పండుగ సందడి మొదలైంది. నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మార్కెట్లకు పూలరాశులు వచ్చి చేరాయి. గురువారం గౌరీ పండుగ, శుక్రవారం వినాయక చవితి ఆచరణకు ఇళ్లలో ప్రతిష్ఠించి పూజిం చేందుకు మట్టితో చేసిన చిన్న విగ్రహాల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

పండుగ మందు రోజు విగ్రహాలు, పూలు, పండ్ల ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతో నగరవాసులు కొనుగోళ్లను ప్రారం భించారు.

పండుగకు వూర్లకు వెళ్లేవారి కోసం ఏపీఎస్‌ఆర్టీసీ, కెఎస్‌ఆర్టీసీతో పాటు ప్రైవేటు ట్రావెల్స్, రైళ్ల రిజర్వేషన్లు చేయించు కునే వారితో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ట్రావెల్ ఏజెంట్ల వద్ద రద్దీ నెలకొంది.

## కళింగ స్టేడియంలో ఫుట్‌బాల్ ఫెస్టివల్



భువనేశ్వర్ : ఈ ఏడాది అక్టోబరులో అండర్-17 ప్రపంచకప్ ఫుట్‌బాల్ పోటీలు మనదేశంలో నిర్వహించనున్నారు. దీంతో దేశంలో వివిధ ప్రాంతాల్లో ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మిషన్ ఎలెవన్ మిలీనియం పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భువనేశ్వర్ కళింగ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటైంది. రాష్ట్ర క్రీడల శాఖ, ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఉత్సవాల్లో 25 పాఠశాలలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి చంద్రసారథి బెహర, కార్యదర్శి విశాల్‌దేవ్ అతిథులుగా పాల్గొని ఫుట్‌బాల్ ఆడి ఉత్సవాలను ప్రారంభించారు. ప్రపంచకప్ పోటీలకు ఏర్పాటు చేసిన మస్కట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రీడలశాఖ మంత్రి బెహర మీడియాతో మాట్లాడుతూ ఒడిశాలో ఫుట్‌బాల్ ఆటకు అవసరమైన వసతులు కల్పించే లక్ష్యంతో ఈ ఉత్సవాలు నిర్వహించామన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న శిక్షకులు, క్రీడాకారులకు ఫుట్‌బాల్‌పై శిక్షణ కల్పించడంతోపాటు సూచనలు, సలహాలు అందించే ఏర్పాట్లు చేశామన్నారు.

### మొదటి పేజీ తరువాయి

## పోల్ సీన్ ప్రశాంతం

గొట్టాలని అధికార పక్షం ప్రయత్నిస్తోంది. శాంతియుతంగా ఎన్నికలు జరగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నా. జగనన్న సీఎం కావాలనేది అందరి కోరిక. ఆ కోరికకు తొలి మెట్టు నంద్యాల ఉప ఎన్నిక. అని అన్నారు. శిల్పా నాగినిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఓటర్లు వేసే ఓటు వారికి తప్ప ఎవరికీ తెలియదని పేర్కొన్నారు.

కాగా నంద్యాల ఉప ఎన్నికలో మహిళాలోకం కదలి వస్తోంది. అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు మహిళా ఓటర్లు...... పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. దాదాపు చాలా పోలింగ్ బూత్స్ వద్ద ....మహిళా ఓటర్లే ఎక్కువుగా కన్పించడం ఇందుకు నిదర్శనం. 85 ఏళ్లు దాటిన మహిళలు, గర్భిణి మహిళలు సైతం ఓటు వేసేందుకు రావడం విశేషం.

## సెప్టెంబర్‌లో రూ.200 నోటు..!

వారంలో చలామణిలోకి రానున్నట్లు సమాచారం. ఈ మేరకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న కొందరు వ్యక్తులు విషయాన్ని వెల్లడించారు. అయితే రూ. 200నోట్ల అందుబాటులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు 50 కోట్ల నోట్లను ముద్రించినట్లు తెలుస్తోంది.

రూ. 100, రూ. 500 మధ్య మరో క్రెన్సీ నోటు ఇప్పటివరకూ లేదు. దీంతో రూ. 200 నోటు మంచి ఆదరణ పొందుతుందని ఆర్‌బీఐ అంచనా. అంతేగాక.. రూ. 200నోట్లు అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్‌బీఐ అన్ని చర్యలు తీసుకుంటోంది అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

## భాజపాలోనే కొనసాగుతా

చేశారు. రాష్ట్ర మంత్రి స్థాయికి ఎదడగానికి భాజపాతో వెంకయ్యనాయుడు కూడా ప్రోత్సహించారని పేర్కొన్నారు. తన గెలుపు కోసం తెదేపాతో పాటు పవన్‌కల్యాణ్ కూడా కృషి చేశారని కామినేని శ్రీనివాస్ తెలిపారు.

మంత్రి కామినేని శ్రీనివాస్ భాజపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన తెదేపా తరపునే పోటీ చేయనున్నారని వార్త హల్‌చల్ చేస్తోంది. దీనిపై మంత్రి స్పందిస్తూ ఆ ప్రచారానికి తెరదించారు.

## రాజస్థాన్ సర్కార్‌పై రాబర్ట్ వాద్రా ఫైర్

ప్రాసిక్యూట్ చేసుకోండి..ఇలాంటి అసత్యాలు నిజాన్ని కప్పిపుచ్చలేవు' అని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. రాజస్థాన్ ప్రభుత్వం తనపై సాగిస్తున్న కుట్రపూరిత ప్రచారంలో ఇది ఓ భాగమేనని ఆయన అన్నారు. బికనీర్ భూముల ఒప్పందంలో వాద్రా పాత్రను నిగ్గుతేల్చేందుకు రాజస్థాన్ ప్రభుత్వం సీబీఐ విచారణ చేపట్టాలని కేం?ద్రాన్ని కోరిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాదాన్యత సంతరించుకున్నాయి.

## నైతికంగా బాధ్యత వహిస్తా.. రాజీనామా చేస్తా

ప్రధాని మోడీ మాత్రం వేచి చూడాలని సూచించారని తెలుస్తోంది. అంతకుముందే, రైల్వే బోర్డు చైర్మన్ అశోక్ మిట్టల్ రాజీనామా లేఖ చేశారు. తన రాజీనామా లేఖను రైల్వే మంత్రి సురేశ్ ప్రభుకి సమర్పించారు.బుధవారం జరిగిన కైఫీయత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం, నాలుగు రోజుల క్రితం జరిగిన ముజఫర్ నగర్ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదాల కారణంగా అశోక్ మిట్టల్ రాజీనామా చేశారు.

## గణేష్ ఉత్సవాలు, బక్రీద్ వేడుకలకు గట్టి బందోబస్తు

చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలో కరీంనగర్, రామగుండం కమిషనరేట్లు, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లోని పోలీసు అధికారులతో సమావేశం జరిగింది. కరీంనగర్ రేంజ్ డీఐజీ సి.రవివర్మ మాట్లాడుతూ... గణేష్ నవరాత్రోత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు శాంతి కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. వివిధ మతాలకు చెందిన ప్రార్థనా స్థలాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నవరాత్రోత్సవాలు ముగిసేంత వరకు రేయింబవళ్లు పెట్రోలింగ్ చేయాలని చెప్పారు. నిమజ్జనం కార్యక్రమం మధ్యాహ్నం నుంచి ప్రారంభమై అర్ధరాత్రి వరకు అనుమతులు తీసుకునేలా చూడాలని చెప్పారు. నిమజ్జనం ప్రాంతాల్లో అదనంగా క్రేన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని తెలిపారు. సీసీ కెమేరాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ సీసీ కెమేరాల ఏర్పాటులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలకు సుహృద్భావ వాతావరణం కల్పించడానికి 5ఎస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ల ఆధునీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పశువుల సంతల్లో కూడా గోవుల అమ్మకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోవుల రవాణా నియంత్రణ కోసం సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆధ్యాత్మిక, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రోత్సవాలు, బక్రీద్ వేడుకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో కరీంనగర్, రామగుండం కమిషనర్లు వి.బి కమలాసన్‌రెడ్డి, విక్రమ్‌జీత్ దుగ్గల్, జగిత్యాల, సిరిసిల్లా ఎస్పీలు అనంతశర్మ, విశ్వజిత్ కంపాటి, పెద్దపల్లి, మంచిర్యాల డీఎస్పీలు విజయేందర్‌రెడ్డి, జాన్‌వెస్లీ, ఏఎస్పీ సింధూశర్మ, ఏసీపీలు వి.తిరుపతి, జె.రామారావు, అశోక్‌కుమార్, ఎం.రవీందర్‌రెడ్డి, చిన్నయ్య, డీఎస్పీలు మల్లారెడ్డి, చంద్రశేఖర్, అవధాని, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మెట్రో' సొరంగ పనుల పరిశీలన



చెన్నై : చెన్నై సెంట్రల్ మెట్రో రైలు సొరంగ మార్గ పనులను ఢిల్లీ నుంచి వచ్చిన మెట్రో రైలు సంస్థ అధికారులు పరిశీలించారు. చెన్నై వన్నార్‌పేట నుంచి విమానాశ్రయం వరకు 23 కిలోమీటర్ల దూరం మేరకు రెండో మార్గం మెట్రో రైలు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మొదటి విడతగా కోయంబేడు-ఆలందూరు, ఆలం దూరు- పరింగిమలై, విమానాశ్రయం...

చిన్న మలై, నెహ్రూ పార్కు-విమానాశ్రయం మధ్య మెట్రో రైలు సేవలు కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో సొరంగ మార్గ పనులను ఢిల్లీ మెట్రో రైలు అధికారులు పరిశీలించారు.

## పార్టీ నుంచి వైద్యలింగం బహిష్కరణ: దినకరన్

చెన్నై : అన్నాడీఎంకే నుంచి ఎంపీ వైద్యలింగాన్ని బహిష్కరిస్తున్నట్టు టీటీవీ దినకరన్ ప్రకటించగా... ఆ అధికారం ఆయనకు లేదని వైద్యలింగం పేర్కొన్నారు. అన్నాడీఎంకే చీలికవర్గాలు విలీనం తర్వాత ఎంపీ వైద్యలింగాన్ని మార్గదర్శక కమిటీలో ఉప ఆర్గనైజర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైద్యలింగం మాట్లాడుతూ... సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి శశికళను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించడానికి చర్యలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎంపీ వైద్యలింగాన్ని అన్నాడీఎంకే నుంచి తొలగిస్తున్నట్టు టీటీవీ దినకరన్ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు వైద్యలింగాన్ని అన్నాడీఎంకే సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్టు తెలిపారు.

శశికళ ఆమోదంతో ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. రెండు వర్గాల విలీనం ద్వారా చిన్నమ్మకు ద్రోహం చేశారని వ్యాఖ్యానించారు. దీనిపై ఎంపీ వైద్యలింగం స్పందిస్తూ... తనను పార్టీ నుంచి తొలగించే అధికారం దినకరన్‌కు లేదన్నారు. అన్నాడీఎంకే కార్యకర్తలు 99.9 శాతం మంది తమ వైపే ఉన్నారని, ప్రస్తుతం దినకరన్‌కు మద్దతు తెలిపే ఎమ్మెల్యేలు కూడా త్వరలో తమవైపునకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ఆదివాసీ మహిళలకు రక్షణ కరవైంది

### రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ

ఉట్నూరు : దేశంలో ఆదివాసీ మహిళలకు రక్షణ కరవైందని ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ ధ్వజమెత్తారు. ఉట్నూరు ప్రెస్‌భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఛత్తీస్‌గడ్‌లోని ఓ పాఠశాలపై పోలీసులు దాడిచేసి ఆదివాసీ మహిళలపై అత్యాచారానికి పాల్పడినా ఇప్పటివరకు వారిపై అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే అత్యాచారాలకు పూనుకోవడంతో ఇక మహిళలను రక్షించేదెవరని ఆమె ప్రశ్నించారు. దిల్లీలో జరిగిన అత్యాచార ఘటనలపై హడావుడి చేస్తున్నారు తప్ప అమాయక ఆదివాసీ మహిళలపై జరిగే దాడులపై ప్రభుత్వాలు, పాలకులు స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. పదేళ్ల క్రితం సమైక్య రాష్ట్రంలోని విశాఖ మన్యంలోని బిమడుగుల మండలం, నర్మతి గ్రామంలో 11 మంది ఆదివాసీ మహిళలపై పోలీసులు సామూహికంగా అత్యాచరం జరిపితే దోషులకు ఇప్పటి వరకు శిక్షపడలేదన్నారు.

న్యాయం కోసం బాధితులు ఎదురుచూస్తున్నార న్నారు. నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చత్తీస్‌గడ్, విశాఖ మన్యంలోని నర్మతి గ్రామంలో జరిగిన ఘటనలపై చర్యలు తీసుకొని బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో దోషులకు శిక్షణ పడేవరకు ఆదివాసీ మహిళా సంఘం బాధితుల పక్షాన న్యాయపోరాటాన్ని చేస్తోందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యులు భాగుబాయి, జైవంతబాయి, రాజవ్వ, లలిత, కన్నవ్వ, ఎల్లవ్వ, గంగామణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నాటిన మొక్కలను సంరక్షించాలి: ఎంపీ నగేష్



బజార్‌హత్నూర్ : పచ్చదనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీ గొడం నగేష్ అన్నారు. మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని వాటిని ప్రతిఒక్కరూ సంరక్షించాలని, నాటిన మొక్కలను నిర్వాహకుల కృషి, పట్టుదలతో మొక్కలు పెరిగి పెద్దయ్యేవరకు కాపాడాలని ఆయన సూచించారు. బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కనకాయి జలపాతానికి వెళ్లే రహదారి పక్కన ఆయన మొక్కలు నాటారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి భవనాల శాఖ నిధులతో కడెం, అడేగామ లోలెవల్ వంతెనల నిర్మాణాలతో పాటు బజార్‌హత్నూర్ మండలంలో మూడు కిలో మీటర్ల రెండువరుసల రహదారికి రూ. 9 కోట్లతో నిధులు మంజూరైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి మాడవి రేణుకాబాయి, తెరాస జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ రమణ, మండల కన్వీనర్ రమణ, మండల నాయకులు అల్క గణేష్, చిల్కూరి భూమన్న, గవ్వల దెవేందర్, చట్ల ఉత్తం, కొత్తశంకర్, అందే ప్రకాష్, రాములు, నర్సయ్య, సాయన్న, నారాయణ, లక్ష్మన్, గిర్నూర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



నల్గొండ : గణేష్ నిమజ్జనం సందర్భంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం చేయడానికి హాలియా వద్ద ఉన్న 14వ మైలురాయి సాగర్ ప్రాజెక్టు కెనాల్‌లోకి నీరు వచ్చే అవకాశం తక్కువ ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో ఇరిగేషన్, ఎన్ఎస్‌పీ, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎస్‌ఎల్‌బీసీ, రెవెన్యూ, పోలీసు అధికారులతో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది గణేష్ నిమజ్జనం చేసిన ప్రాంతాల్లో నీరు వచ్చే అవకాశం తక్కువ ఉన్నందున నీరు ఎక్కువగా ఉన్న ఇరిగేషన్ ట్యాంకులను పరిశీలించి నిమజ్జనం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. నల్గొండ, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాల్లో చెరువులను రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి గణేష్ నిమజ్జనానికి అనుకూలంగా ఉన్న చెరువులను పరిశీలించాలన్నారు.

మిర్యాలగూడ ప్రాంతంలో మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, నిడమనూరు మండలాల రెవెన్యూ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు, ఐబీ అధికారులు చెరువులను పరిశీలించి నిమజ్జనానికి అనుకూలంగా ఉన్న చెరువుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఎస్పీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతంలో గణేష్ నిమజ్జనం చేయడానికి ఎటువంటి సమస్య లేదన్నారు. నల్గొండ, మిర్యాలగూడ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనం చేయడానికి అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌వో ఖీమ్యానాయక్, ఏఎస్పీ శ్రీనివాస్, ఎన్ఎస్‌పీ, ఎస్ఎల్‌బీసీ, ఏకేబీఆర్, ఐబీ అధికారులు, నల్గొండ, దేవరకొండ ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోనే కలెక్టరేట్ నిర్మించాలి

మెదక్ : ఎన్నో పోరాటాల తర్వాత జిల్లాకేంద్రాన్ని సాధించుకున్నామని, నూతనంగా నిర్మించే కలెక్టరేట్‌ను ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రస్తుత ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం వద్ద నిర్మించాలని డీసీసీ అధ్యక్షురాలు, మాజీ మంత్రి సునీతారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఏవో బలరాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరు లతో మాట్లాడుతూ ఆర్డీవో కార్యాలయం సమీపంలో చర్చి, బస్టాండ్ ఉందని, త్వరలో కిలోమీటర్ దూరంలో రైల్వేస్టేషన్ ఏర్పాటు కానుందని తెలిపారు. ఇదివరకు పట్టణంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడితే 99 శాతం మంది ప్రజలు ఆర్డీవో కార్యాలయం వద్దనే నిర్మించాలని తమ అభిప్రాయాన్ని తెలియజేశారని పేర్కొన్నారు.

మరోచోట కలెక్టరేట్‌ను నిర్మించాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కొల్చారం జడ్పీటీసీ సభ్యు లు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సుప్రభాత్ రావు, జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, చంద్ర పాల్, మామిళ్లఆంజనేయులు, కృష్ణగౌడ్, మున్సి పల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మధుసూదన్ రావు, కౌన్సిలర్ రబిన్‌దివాకర్, నాయకులు హాఫిజుద్దీన్, రాంచందర్‌గౌడ్, శ్రీకాంత్, కిషన్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సిద్దిరాములు, పోతరాజురమణ, శ్రీమాన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సెప్టెంబరు 1న సామూహిక సెలవు

రామాయంపేట: కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని టీఎస్‌సీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి యాదవరెడ్డి డిమాండ్ చేశారు. రామాయంపేట మండల విద్యాధికారి కార్యాలయ ఆవరణలో సామూహిక సెలవుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోరుతూ వచ్చే నెల 1న చేపట్టే సామూహిక సెలవు కార్యక్రమానికి అన్ని సంఘాల సంపూర్ణ మద్దతు లభించిందని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు సామూహికంగా సెలవు పెట్టి జిల్లా కేంద్రంలో జరిగే నిరసన దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని స్పష్టంచేశారు. సంఘం జిల్లా కోశాధికారి నవీన్‌రత్నాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నర్సాగౌడ్, రాజయ్య, వెంకటస్వామి, రవీందర్‌గౌడ్, చక్రవర్తి, గోపాల్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్యాలయ ఏర్పాటుకు భవనాల పరిశీలన

నర్సాపూర్: నర్సాపూర్‌లో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు అనుకూలమైన భవనాలను తూప్రాన్ డీఎస్పీ భాస్కర్ పరిశీలించారు. వీలైనంత త్వరలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పక్కా భవనాల నిర్మాణానికి రెండెకరాలు అవసరమని చెప్పారు. మెదక్-తూప్రాన్ మార్గం ఇందుకు అనుకూలంగా ఉంటుందని, పక్కా భవనాల నిర్మాణానికి అనుకూలమైన స్థలాల గుర్తింపు, తాత్కాలిక భవనాలను గుర్తిస్తూ నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. సీఐ కార్యాలయాల ఏర్పాటుకు పాలనా సౌలభ్యం మేరకు చర్యలు తీసుకుంటారన్నారు. కౌడిపల్లిలో డీఎస్పీ కార్యాలయం ప్రతిపాదన లేనేలేదని కొట్టిపారేశారు. స్థానిక సర్వేయర్ సునీత, వీఆర్వో గణేశ్‌ల నుంచి స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు, సర్వే నెంబర్లు సేకరించారు. సీఐ తిరుపతిరాజు, ఎస్ఐ వెంకటరాజుగౌడ్ ఉన్నారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

పాల్వంచ : సీపీఎస్ పింఛను విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని అమలు చేయాలని పలు ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సీపీఎస్‌కు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న తలపెట్టిన సామూహిక సెలవు కార్యక్రమ గోడపత్రాలను తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ గనియా, ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. నాయకులు రామకృష్ణ, ప్రభాకర్, యాకూబ్, పూర్ణచందర్‌రావు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అలాగే టీపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పాల్వంచ బాలుర ఆశ్రమ పాఠశాలలో గోడపత్రాలను ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### ఒకరోజు నిరాహారదీక్షలో కూర్చున్న కార్మికులు

శాంతినగర్ : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నాయకులు డిపో ఎదుట నిరాహారదీక్షలో కూర్చున్నారు. సంఘం రీజియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.ఆర్.రెడ్డి, వెంకటయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయా డిపోల పరిధిలో డిపో మేనేజర్లకు రాష్ట్రకమిటీ పిలుపుమేరకు ఇదివరకే వినతిపత్రాలు సమర్పించామన్నారు. వాహన చోదకులకు మాత్రమే ఆర్టీసీ విధుల ఛార్టులను వేసి కండక్టర్లకు వేయకపోవడంతో వారు విధుల కోసం వచ్చి గంటల తరబడి వేచి ఉండి నిరాశతో వెనుదిరుగాల్సి వస్తుందన్నారు. సింగరేణి కార్మికులకు అందించిన విధంగానే సకలజనుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు ఆర్టీసీ కార్మికులకు అందించాలని కోరారు. నాణ్యమైన టిమ్స్ యంత్రాలు అందజేసి డ్రైవర్ల ఇష్ట ప్రకారంలో టిమ్స్ డ్యూటీ వేయాలని కోరారు. స్పేర్‌లో ఉన్న కార్మికులకు బలవంతంగా సెలవు వేయకుండా ప్రోత్సాహకాల్లో కోతలు నిలిపివేయాలన్నారు. మెకానిక్‌లకు అవసరమైన వస్తువులు అందజేసి వారిని ప్రోత్సహించాలన్నారు. రద్దు చేసిన బస్సులను తిరిగి ప్రారంభించి, వేతన సవరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరాహారదీక్షలో ఈయూకు చెందిన కార్మికులు సుధాకర్, హిరాజీ, ఎ.చంద్రశేఖర్‌లు కూర్చున్నారు. వీరికి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కార్యదర్శి ఆశన్న మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రీజియన్ కోశాధికారి కనకయ్య, డివిజనల్ అధక్షుడు , డిపో అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, సురేందర్, గ్యారేజీ కార్యదర్శి ఓంప్రకాష్, రీజియన్ కోశాధికారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో త్వరితగతిన కేసుల పరిష్కారం

### కార్యశాలను ప్రారంభించిన జిల్లా ప్రధానన్యాయమూర్తి డి.తిరుమలరావు



నల్గొండ : మధ్యవర్తిత్వ పరిష్కారం రాజీతో కేసులను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.తిరుమల రావు తెలిపారు. ది ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అల్టర్‌నేటివ్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో నల్గొండలోని కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో తెలంగాణ రోడ్డు భవనాలు, ఇరిగేషన్ అండ్ క్యాడ్, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లకు మధ్యవర్తిత్వ పరిష్కారంపై నిర్వహించిన రెండు రోజుల కార్యశాలను ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వ పరిష్కారాన్ని చట్టంగా రూపొం దించిందని వివరించారు. ఈ చట్టం 2015 అక్టోబరు 23 నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యశాలలో మధ్యవర్తిత్వంలోని ప్రాథమిక సూత్రాలపై వివరించారు. ఇటీవల అర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ చట్టం 2015లో వచ్చిన సవరణలు, ఏడీఆర్ విధానాలతో కలిగే ప్రయోజనాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని ఐసీఏడీఆర్ ప్రాంతీయ కేంద్రం ఇన్‌ఛార్జి కార్యదర్శి జేఎల్ఎన్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ ఎన్.బాలస్వామి, వివిధ శాఖల నుంచి ఇంజినీర్లు పాల్గొన్నారు.

## హరితహారంలో అనుకున్న వేగం లేదు

### రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ పీకే.ఝా



మహబూబ్‌నగర్ : తెలంగాణకు హరితహారం రెండో విడతలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాలమూరులో అనుకున్న వేగం లేదని రాష్ట్ర అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ పీకే.ఝా అన్నారు. ఆయన హైదరాబాదు నుంచి జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, భవనాలశాఖ పరిధిలో హరితహారం పూర్తి మందకొడిగా సాగుతుందన్నారు. అటవీ ప్రాంతాల్లో చేపడుతున్న పనులు, వాటి పురోగతిపై సమీక్షిస్తూ అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డిమాండ్ ఉన్న మొక్కలను మాత్రమే పెంచాలని అన్నారు. అటవీశాఖ అధికారులు ఎంపీడీవోలతో సమన్వయంతో సాగాలన్నారు. తెలంగాణకు హరితహారానికి కేటాయించిన నిధుల వివరాలు ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ మాట్లాడుతూ అనుకున్న స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టలేకపోయామన్నారు. వర్షాలు కురిసిన వెంటనే లక్ష్య సాధనకు అవసరమైన మొక్కలు నాటేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎఫ్‌వో సీహెచ్.గంగారెడ్డి, డీఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమిరెడ్డి, దేవాదాయ శాఖ ఏసీ కృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, నీటిపారుదలశాఖ, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మిషన్ కాకతీయ పనులపై ఇక ఆకస్మిక తనిఖీలు

### నాణ్యత విభాగం సీఈ వెంకటేశ్వర్లు



మహబూబ్‌నగర్ : మిషన్ కాకతీయ కింద మరమ్మతులు చేస్తున్న చెరువు పనులపై ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు చేయబోతున్నట్లు చిన్ననీటి పారుదలశాఖ నాణ్యత విభాగం చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ సురేశ్‌కుమార్, నాణ్యత విభాగం ఎస్ఈ నరేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నీటిపారుదలశాఖ ఎస్ఈ ఆనంద్‌సాగర్‌తో కలిసి మహబూబ్‌నగర్‌లోని రోడ్డు భవనాలశాఖ అతిథి గృహంలో సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో నాలుగు జిల్లాలకు చెందిన చిన్ననీటి పారుదలశాఖ ఈఈలు, డీఈలు, ఉమ్మడి జిల్లా నాణ్యత విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిషన్ కాకతీయ పనుల నాణ్యతలో రాజీ పడేదిలేదన్నారు. ఇప్పటి వరకు జరిగిన మొదటి, రెండో విడత పనులను, ప్రగతిలో ఉన్న మూడవ విడత పనులను ఆకస్మిక తనిఖీలు చేసేందుకు నాణ్యత విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ బృందాలు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏ సమయంలోనైనా మిషన్ కాకతీయ పనుల తనిఖీకి చెరువుల వద్దకు చేరుకుంటాయన్నారు. చెరువుల్లో జరుగుతున్న మరమ్మతు పనులు నాణ్యతకు అనుగుణంగా జరిగేలా చూడాలని, ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా గుత్తేదారులపై అప్రమత్తతతో వ్యవహరించాలని ఆయా జిల్లాల ఈఈ, డీఈలకు సూచించారు. చెరువుల్లో కట్ట విస్తరణ, తూము, అలుగు, పంట కాల్వ నిర్మాణం పనులు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల్లో పూడికతీత నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఒక్కో జిల్లాలో మూడు విడతల్లో ఏమేరకు మిషన్ కాకతీయ పనులు జరిగాయో, ఎంత మేరకు బిల్లులు చెల్లింపులు చేశారో ఈఈల ద్వారా నివేదికలు పరిశీలించారు. రెండో విడతలో ఇంకా మిగిలిన పనులపై ఈఈ నుంచి సంజాయిషీ తీసుకున్నారు.

పెద్ద చెరువు పనుల తనిఖీ : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువుపై జరుగుతున్న మినీ ట్యాంక్‌బండ్ పనులను నాణ్యత విభాగం సీఈ వెంకటేశ్వర్లు, చిన్ననీటి పారుదల సీఈ సురేష్‌కుమార్ తనిఖీ చేశారు. కట్టపై జరుగుతున్న సీసీరోడ్డు పనులు చూశారు. ఈపాటికే నిర్మించిన పక్కగోడ పనులు చూసి లెవల్స్, ఫినిషింగ్ సరిగా లేదని, సరి చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు ఫరవాలేదన్నారు. ఇదిలా ఉంటే మహబూబ్‌నగర్‌లో సమీక్షకు ముందు అధికారులు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు.

## ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి సహకారం

కొత్తగూడెం : ఎస్సీ రుణాల మంజూరులో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానం సాధించిందని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. స్థానిక ఎస్సీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. సుమారు 25వేల మంది అభ్యున్నతికి రూ.250 కోట్లు మంజూరు చేశామని, 2016-17 ఆర్థిక సంవత్సరానికి 645 మందిని ఎంపిక చేసి ఇప్పటికి 97 మందికి రూ.7.97కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. మండల స్థాయి కమిటీలతో అర్హులను ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆటో, కిరాణా, ఫ్యాన్సీ తదితర స్వయం ఉపాధి పనుల ద్వారా కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. రూ.5లక్షల పరిమితం గల ఈ రుణాలతో లబ్ధిదారులు జీవన స్థితిగతులను మెరుగుపర్చుకోవాలని కోరారు. స్కాప్ కింద 6,700 మంది లబ్ధిదారులుండగా జిల్లాలో 2017-18కి గాను 2542 మందిని గుర్తించామన్నారు. వీరిలో 112 మందిని గుడుంబా విక్రయాన్ని నిలిపివేయించి 92 మందికి గేదెలు, కిరాణం వంటివి నెలకొల్పేందుకు వంద శాతం రాయితీతో రూ.2లక్షల రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యుబర్ కంపెనీ సహకారంతో ఓనర్ కమ్ డ్రైవర్‌గా రాష్ట్రంలో సెప్టెంబరు 4న 500 క్యాబ్‌లు ఇవ్వనున్నట్లు, వీటికోసం జిల్లాలో 103 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 13మందిని గుర్తించామన్నారు. విదేశీ విద్యకై 31 మంది ఎంపికయ్యారని, ఒక్కొక్కరికి రూ.20లక్షలు చెల్లిస్తున్నామన్నారు. ఏటా రెండు బ్యాచ్‌లుగా ఎంపికలు ఉంటాయని, ఇప్పటివరకు ఇది నాలుగోసారని స్పష్టం చేశారు. 2014-15లో 291, 215-16లో 738 మంది యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించలేదని, వీరిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి మహేశ్వర్ పాల్గొన్నారు.

విజయభాను

## సంపాదకీయం

### ఆత్మగౌరవ తీర్పు

తక్షణ తలాఖ్ (తలాఖ్- ఎ- బిద్దత్) విధానాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైనది. ఈ రకమైన తలాఖ్ రాజ్యాంగంలోని మత స్వాతంత్ర్యాన్ని కాపాడే 25 అధికరణం ప్రకారం కూడా చెల్లుబాటు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తితో పాటు మొత్తం ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని ముగ్గురు సభ్యులు తమ మెజారిటీ తీర్పును వెలువరించారు. అత్యం త అరుదైన రీతిలో ప్రధాన న్యాయమూర్తి మెజారిటీ తీర్పుతో ఏకీభవించకపోవడం విశేషం. మెజారిటీ అభిప్రాయాన్ని ప్రతిబింబించిన న్యాయమూర్తి నారిమన్ ఇచ్చిన తీర్పు గమనార్హమైనది. ముస్లిం మహిళలు న్యాయం అర్థించినప్పుడు న్యాయస్థానం చేతులు ముడుచుకొని కూర్చోలేదని జస్టిస్ నారిమన్ స్పష్టం చేశారు. మూడు రకాల తలాఖ్ విధానాలు 1937 నాటి షరియత్ చట్టం రెండవ సెక్షన్ ప్రకారం అమలులో ఉన్నాయి. అందువల్ల ఈ తలాఖ్ చట్టపరంగా అమలులో ఉన్నదే తప్ప మతపరంగా కాదని నారిమన్ తమ తీర్పులో స్పష్టం చేశారు. 13 అధికరణం ప్రకారం- రాజ్యాంగం ఆమోదించడానికి ముందు ఆ తరువాత గల చట్టాలన్నీ ప్రాథమిక హక్కులకు భంగం కలిగించనివై ఉండాలె. అందువల్ల ప్రాథమిక హక్కులకు భంగకరంగా ఉన్న తలాఖ్ చెల్లుబాటు కాదని న్యాయమూర్తి నారిమన్ తమ తీర్పులో వివరించారు. ముస్లిం మహిళల హక్కులకు, ఆత్మగౌరవానికి భంగకరంగా ఉన్న తలాఖ్ విధానం చాలా కాలంగా వివాదాస్పదంగా మారింది. పలువురు ముస్లిం మహిళలు ఈ విధానాన్ని సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వివిధ హక్కుల సంఘాలు కూడా తలాఖ్ విధానాన్ని సవాలు చేశాయి. అయితే ముస్లిం పర్సనల్ లా బోర్డు మాత్రం ఇది ముస్లిం మత ఆంతరంగిక అంశమని అభిప్రాయపడుతున్నది. మతపరమైన సున్నితమైన అంశమైనప్పటికీ, మహిళల హక్కులకు సంబంధించినది కావడం వల్ల ఈ విధానం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఖురాన్‌లో, షరియత్‌లో తలాఖ్ విధానం లేదు. మహమ్మద్ ప్రవక్త కూడా విడాకులకు మానవీయమైన, ప్రజాస్వామిక విధానాన్ని సూచించారు. అయితే కొన్ని వందల ఏండ్లుగా అమలులో ఉన్నదనే కారణంగా తలాఖ్ ను ముస్లిం మత విధానాలలో భాగంగా గుర్తించాలనే వాదన ముందుకువచ్చింది. తలాఖ్‌లో మూడు రకాల విధానాలు ఉన్నాయి. ఇందులో బిద్దత్ విధానం ప్రకారం అప్పటికప్పుడే మూడుసా ర్లు తలాఖ్ చెప్పి విడాకులు పొందడం. ఈ విధా నం ఆవేశంలో, తాగిన మైకంలో తలాఖ్ చెప్పినా చెల్లుబాటు కావడం మొదలైంది. ఫోన్, ఈ- మెయి ల్, వాట్సాప్ మొదలైన పద్ధతుల్లో కూడా మూడుసార్లు తలాఖ్ చెప్పి భార్యను వదిలి పెట్టార నే ఆరోపణలు ఉన్నాయి. మిగతా రెండు తలాఖ్ పద్ధతులకు భిన్నంగా తలాఖ్ బిద్దత్ ద్వారా విడాకులు పొందితే మళ్ళా అదే వ్యక్తితో కాపురానికి వీలులేదు. ఆ మహిళ మరో వ్యక్తిని వివాహమాడి, కాపురం చేసి విడాకులు తీసుకుంటే కానీ పాత భర్త ను వివాహం చేసుకోవడం సాధ్యం కాదు. ఈ తలాఖ్ బిద్దత్ మహిళలకు క్షోభనిస్తున్నది. వారి ఆత్మగౌరవానికి భంగకరంగా మారింది. అందువల్ల మహిళల హక్కుల పరిరక్షణకు న్యాయపోరాటం ఉధ ృతమైంది. సుప్రీంకోర్టు ముందుకు బహుభార్యత్వం వంటి ఇతర అంశాలు వచ్చినప్పటికీ, ఈ మూడవ రకం తలాఖ్‌పైనే ద ృష్టి సారించింది. తలాఖ్‌ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రాజకీయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ తీర్పును సమానత్వం, మానవ హక్కుల కోణంలో చూడాలే తప్ప మతపరమైన ద ృక్కోణంలో వ్యాఖ్యానించడం సబబు కాదు. ముస్లింలలోని ఆధునికత సంతరించుకున్నవారు ఈ తలాఖ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఏ మతంలోనైనా అభివ ృద్ధి చెందినవారు పాతకాలపు అమానవీయ చట్టాలను వ్యతిరేకించడం సహజం. ప్రతిమతంలోనూ స్వీకరించదగిన అంశాలతోపాటు తిరస్కరించదగినవీ ఉంటాయి. కాలం మారే కొద్దీ కొన్ని సంప్రదాయాలను వదిలివేయక తప్పదు. ఇది అన్ని మతాలకూ వర్తిస్తుంది. ఉదారవాద ప్రజాస్వా మ్య సంస్క ృతిలో భాగంగా మతపరమైన అంశాలలో జోక్యం చేసుకోకూడదని స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో దేశ నాయకులు భావించారు. తమ ఆంతరంగిక అంశాలలోకి రాజ్యం చొరబడుతుందని, తద్వారా తమ విశ్వాసాలకు భంగం కలుగుతుందని భిన్న మతాలవారిలో భయాందోళనలు కూడా వ్యక్తమయ్యాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచింది. ఆధునిక సంస్క ృతి సమాజంలో విస్తరించింది. ఇప్పుడు లౌకిక విషయాలలో మతం పాత్ర ఉండకూడదనే భావన సమాజంలో బలపడ్డది. అందువల్ల ఆయా మతాలలోని లౌకిక, అభ్యుదయవాద శక్తులకు ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి.

# పాక్..తీరు మార్చుకో: ట్రంప్



వాషింగ్టన్: ఉగ్రవాదులకు పాక్ స్వర్గ దామంగా మారిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు కొనసాగిస్తోందని, ఇలానే కొనసాగితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుం దని హెచ్చరించారు. ఉగ్రవాద సంస్థలకు, తాలిబన్లకు పాక్ చేస్తున్న సాయంపై ఎక్కువ కాలం నిశ్శబ్దంగా ఉండబోమని స్పష్టం చేశారు. అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా చేపట్టిన ఆపరేషన్లలో భాగస్వామిగా ఉంటూ పాకిస్తాన్ భారీ లబ్ధి పొందిందని, కాని ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం ద్వారా కూడా భారీగానే నష్టపోతుందని హెచ్చరించారు.

శాంతి నెలకొల్పేందుకు భారత్‌తో కలసి పనిచేయాలని సూచించారు. వర్జీనియా రాష్ట్రం అర్లింగ్టన్‌లోని ఫోర్ట్ మేయర్‌లో తన పాలనా యంత్రాంగంలోని ముఖ్య అధికారులు సహా సుమారు 2 వేల మందిని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. అఫ్గాన్‌లోని తమ సైనికులను వెనక్కి రప్పించే విషయంలో ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. అఫ్ఘానిస్తాన్, దక్షిణాసియాపై తమ వ్యూహం మారిందని, అమెరికా దళాలు విజయం కోసమే పోరాడుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 8,500 దళాలు అఫ్గాన్‌లో ఉండగా.. మరో 4 వేల దళాలను అక్కడికి పంపనున్నట్లు సమాచారం.

# ఎలుగుకు ఆహారం ఇవ్వబోయి..



బీజింగ్: సఫారీలోని జంతువులకు ఆహారం ఇవ్వకూడాదని జూ అధికారులు ఎన్నిసార్లు చెబుతున్నా చాలా మంది పర్యా టకులు పెడచెవిన పెట్టి ప్రాణాల మీదికి తెచ్చు కుంటున్నారు. చైనాలోని బీజింగ్ శివారు బడాలింగ్ వైల్డ్‌లైఫ్ వరల్డ్ పార్కులో సరిగ్గా ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. బాధితుడికి చావు తప్పి కన్ను లొట్టబోయి నట్లయింది.జంతుప్రదర్శన శాలలోని సఫారీలో ఓ వ్యక్తి కారులో ప్రయాణిస్తూ అక్కడ ఉన్న ఎలుగుబంటులకు కారు అద్దం కిందికి దించి ఆహారాన్ని అందించాడు. అంతే ఒక్కసారిగా మూడు ఎలుగుబంట్లు వచ్చిపడ్డాయి. దీంతో వెంటనే అతను అద్దాలు పైకి ఎత్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో అతని చేతికి చిన్నపాటి గాయాలయ్యాయి.ఈ తతంగాన్నంతా అక్కడ ఉన్న మిగతా పర్యాటకులు తమ మొబైల్స్‌లో వీడియో తీసి ఇంటర్నెట్‌లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. గత ఏడాది ఇదే పార్కులో కారు తలుపులు తెరచి బయట నిల్చున్న ఇద్దరు మహిళలపై పులి దాడి చేయడంతో వారు మృతి చెందారు.


# పాక్‌పై స్వరం పెంచిన అమెరికా



వాషింగ్టన్ : ఉగ్రవాదులకు ఊతమిస్తే కఠిన చర్యలు తప్పవని పాకిస్తాన్‌ను ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో అమెరికా స్వరం పెంచింది. పాక్ తీరు మార్చుకోకపోతే దానిపై ఆంక్షలు విధించడంతో పాటు ప్రధాన నాటోయేతర భాగస్వామి హోదాను తొలగిస్తామని తాజాగా హెచ్చరించింది. తాలిబాన్‌తో పోరాటానికి ఆఫ్ఘనిస్తాన్‌కు చేయూత ఇస్తున్న క్రమంలో పాకిస్తాన్‌తో కలిసి పనిచేయాలని అమెరికా భావిస్తున్నదని, అయితే పాక్ ఉగ్రవాదులకు తన భూభాగంలో చోటివ్వడానికి స్వస్తిపలకాలని అమెరికా విదేశాంగ కార్యదర్శి టిల్లర్‌సన్ హితవు పలికారు.

ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా వారిని తుదముట్టించేందుకు సంసిద్ధంగా ఉండాలని ట్రంప్ సంకేతాలు పంపుతున్నారని కూడా ఆయన పేర్కొన్నారు.మరోవైపు పాకిస్తాన్‌లోపల ఉన్న మిలిటెంట్లపై దాడులు చేపట్టాలని, పాక్‌ను ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా ప్రకటించాలని ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. ఆఫ్ఘన్ వ్యవహారాల్లో మరింతగా జోక్యం చేసుకోవాలని భారత్‌ను అమెరికా కోరుతుండటం కూడా పాక్‌కు షాక్ ఇస్తోంది.

# మంటల ప్రపంచ పటం



ఈ ఏడాది యూరోపియన్ దేశాల్లో ఎండలు మండి పోయాయి.. పోతున్నాయి కూడా. ఇంకోవైపు మంచు ముద్దల నుకునే సైబీరియా, గ్రీన్‌ల్యాండ్‌లలో వేల ఎకరాల్లో కార్చిచ్చు రేగి.. అడవి మొత్తం బూడిదైంది. ఆ.. ఇవన్నీ ఎక్కడో జరిగేవి కదా అనేవాళ్లూ లేకపోలేదు. అందుకేనేమో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) కు చెందిన ఇన్‌ఫర్మేషన్ ఫర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఓ వినూత్నమైన మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఫొటోలో కనిపిస్తున్నది ఆ మ్యాపే. ఏంటి దీని ప్రత్యేకత అంటారా? ఒక్కసారి ఈ మ్యాపును చూస్తే.... కార్చిచ్చులు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదన్న విషయం ఇట్టే తెలిసిపోతుంది.

మ్యాపులో ఇక మనదేశం ఉన్న చోటును చూడండి. ఒకట్రెండు చోట్ల కొంచెం ఎర్రగా ఉంది! మరి మిగతా అంతా బాగున్నట్టేనా? ఊహూ. మనకు వానాకాలం కాబట్టి ఇలా కనిపిస్తోంది అంతే. ఇక ఈ ఏడాది వేర్వేరు దేశాల్లో చోటు చేసుకున్న విపత్తులు, వాటి తీవ్రత గురించి ఒక లుక్ వేద్దాం. పోర్చుగల్‌లో వేడిగాలుల వల్ల ఏకంగా 64 మంది ప్రాణాలు కోల్పోగా.. ఆ దేశంలోనే ఒకచోట కార్చిచ్చు కారణంగా కొన్ని వేల మంది..

ఇతర ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయారు. ఇక కెనడాలోనైతే రికార్డు స్థాయిలో దాదాపు తొమ్మిది వేల హెక్టార్ల అటవి నాశనమైపోయింది. ఏతావాతా.. చెప్పొచ్చేది ఏమంటే.. భూమి భగ్గుమంటోంది. మన అలవాట్లు మార్చుకోకపోతే.. భూమ్మీద పచ్చదనం పెంచకపోతే పక్కనున్న మ్యాప్‌లో ఎరుపు రంగు పెరుగుతూనే ఉంటుంది. భూమ్మీద మన మనుగడకే ముప్పు వాటిల్లనుంది!

## సమయం

### 'విద్యే స్వావలంబనకు మూలం'

విద్య అనేది మనిషి వికాసానికి చాలా అవసరం. మనిషి వ్యక్తిత్వానికి విద్యే ఆయువుపట్టు. విద్య వలన మనిషికి కీర్తి ప్రతిష్ఠలు, ధనము ఇతర గౌరవములు లభిస్తాయి. విద్యావంతుడు సర్వ కార్యాలనూ సఫలీకృతం చేసుకోగలడు. విద్వాంసులను, పండితులను అధికారులూ, నాయకులూ గౌరవిస్తారు. అనేక ప్రజా సమస్యలకు వారి సలహాలు, సూచనలను తీసుకుంటారు. పూర్వం రాజులు పండితులను ఘనంగా సన్మానించేవారు. విద్య ఎవరూ దోచుకోలేని ధనము. మనకు వచ్చిన విద్యను ఎంతమందికి పంచినా అది తరగదు. విద్యాభివృద్ధి వల్లనే మానవుడు అనేకమైన వస్తువులను తయారుచేసి తన జీవితాన్ని సుఖమయం చేసుకోగలిగాడు. విద్యకు ఎలాంటి వయో పరిమితి లేదు. తమకు వచ్చిన విద్యను పదిమందికీ పంచుతూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తే ఆ విద్య సార్ధకమవుతుంది. విద్యను గురించి ఒక శతక కవి ఏమన్నాడో చూడండి.

'ఇచ్చునదె విద్య, రణమున
జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు, వాదుకు
వచ్చునదే కీడుసుమ్ము! వసుధమ సుమతీ'

కవితా రచన:
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి: తదియ రా.9.30; ఉత్తర సా.4.01; రా.వ. 12.38ల 2.16

గురువారం 24-08-2017

**మేషం** : భార్య, భర్తల ఆలోచనలు, అభిప్రాయబేధాలు భిన్నంగా ఉంటాయి. ఫ్యాన్సీ, కిరాణా, సుగంధ ద్రవ్య వ్యాపారస్తులకు కలిసి వచ్చేకాలం. గృహానికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేస్తారు. విదేశాలు వెళ్లటానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. మార్కెట్ రంగాల వారికి నిరుద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. **వృషభం** : రుణ యత్నాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. ఆర్థికంగా మంచి అభివృద్ధిని పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలకు, చిరు వ్యాపారులకు అన్ని విధాల కలిసి రాగలదు. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనిభారం పెరుగుతుంది. మీ సంతానం పై చదువుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. **మిథునం** : స్త్రీలతో సంభాషించేటప్పుడు సంయమనం పాటించండి. ఆడిటర్లు అసాధ్యమనుకున్న కేసులు సునాయాసంగా పరిష్కరిస్తారు. ఆత్మీయులకు విలు వైన కానుకలు చదివించుకుంటారు. ఎప్పటి నుండో ఆగివున్న పనులు పునః ప్రారంభిస్తారు. వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. **కర్కాటకం** : ఉద్యోగ వ్యాపారాల్లో పురోభివృద్ధి సాధిస్తారు. విధినిర్వణలో దొర్లిన తప్పిదాల వల్ల పత్రికా సంస్థలలో వారికి మనస్థిమితం అంతగా ఉండదు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ వ్యాపారస్తులకు సంతృప్తి కానరాగలదు. ప్రయాణాలు అనుకూలిస్తాయి. దైవ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. **సింహం** : గృహావసరాలకు నిధులు సమకూర్చుకుంటారు. ప్రభుత్వ సంస్థల్లో వారు కొంత జాప్యం, ఒత్తిడి ఎదుర్కొనక తప్పదు. వస్త్రములు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. స్త్రీలు అనవసరం విషయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల భంగపాటుకు గురవుతారు. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. **కన్య** : ఉపాధ్యాయులక యాజమాన్యం ధోరణి నిరుత్సాహపరుస్తుంది. రవాణ, ఎదుమతులు, ట్రావెలింగ్ రంగాల వారికి ఆశాజనకం. కిరాణ, ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య వ్యాపారులకు కలిసివచ్చే కాలం. ప్రేమికుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. వైద్యులకు పురోభివృద్ధి. ప్రముఖులను కలుసుకుంటారు. **తుల** : కొబ్బరి, పండ్లు, పూలు, హోటల్, తినుబండారాల వ్యాపారులకు పురోభివృద్ధి. కీలకమైన వ్యవహారాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవటం మంచిది. స్త్రీలు ధనవ్యయం విషయంలో జాగ్రత్త వహించ వలసి ఉంటుంది. కొంత మంది మీతో స్నేహం నటిస్తూనే మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. సంఘంలో ఆదర్శజీవనం గడుపుతారు. చేపట్టిన పనులు సకాలంలో సంతృప్తిగా పూర్తి చేస్తారు. విద్యార్థులకు మిత్ర బృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. మిత్రులను కలుసుకుంటారు. **ధనుస్సు** : నూతన పథకాలు, ప్రణాళికలు చేపడతారు. వస్త్ర, బంగారం, వెండి వ్యాపారస్తులకు పురోభివృద్ధి. స్త్రీలు టివి. ఛానెల్స్ కార్యక్రమాలలో రాణిస్తారు. నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినపుడు ఆచి, తూచి వ్యవహరించండి. మీ అభిప్రాయాలను ఇతరులపై బలవంతంగా రుద్దటం మంచిది కాదని గమనించండి. **మకరం** : ప్రముఖులతో పరిచయాలు మీ ఉన్నతికి నాంది పలుకుతాయి. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. వాదోపవాదాలకు, హామీలకు దూరంగా ఉండటం మంచిది. కొత్త రుణాల కోసం అన్వేషిస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. ఆలయాను సందర్శిస్తారు. **కుంభం** : బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రతి విషయాన్ని సునిశిత దృష్టితో పరిశీలించాల్సి ఉంటుంది. ఇతరులు మీ నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయకత్నిస్తారు. వ్యాపారాలు, ఉపాధి పథకాల్లో నిలదొక్కుకోవటానికి బాగా శ్రమించవలసి ఉంటుంది. **మీనం** : రవాణా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనం కొనుగోలుకై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. అతిధ మర్యాదలు బాగుగా నిర్వహిస్తారు. విదేశాల నుండి ఆహ్వానాలు లభిస్తాయి. భూమి కొనుగోలుకై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్య, వైజ్ఞానిక రంగాలలో వారికి శుభం చేకూరుతుంది.

# ఈ కోనేటి తీర్థాన్ని స్వీకరిస్తే చాలు..

## సంకీర్తన



భగవంతుడి అను గ్రహంతో అక్కడ ఆవిర్భవించిన తీర్థాలు మహిమాన్వితమైనవిగా చెప్పబడుతుంటాయి. అలాంటి క్షేత్రాలలో ఒకటిగా 'శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి' క్షేత్రం కనిపిస్తుంది. నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం 'గోపాలపల్లి' గ్రామంలో గల కొండపై ఈ స్వామి కొలువై వున్నాడు. స్వామివారి పేరుమీదనే ఈ గ్రామానికి ఈ పేరు వచ్చిందని అంటారు.

నల్గొండ జిల్లాలో గల ప్రాచీనమైన క్షేత్రాలలో ఈ వేణుగోపాల స్వామి ఆలయం ముందు వరుసలో కనిపిస్తుంది. స్వామివారు స్వయం భువుగా ఆవిర్భవించడం వలన, ఈ క్షేత్రం ఎంతో విశిష్టమైనదనీ .. మరెంతో మహిమాన్వితమైనదని చెబుతుంటారు. పూర్వం ఎంతోమంది మునులు ఈ కొండపై స్వామివారిని సేవిస్తూ ఉండేవారని అంటారు.

ఇక్కడ కనిపించే 'మంత్ర బావి'ని గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటారు. స్వామివారి పాద స్పర్శతో ఇక్కడ జలం ఉబికి వచ్చి కోనేరుగా మారిందని అంటారు. ఈ కోనేరునే 'మంత్ర బావి' అని పిలుస్తుంటారు. వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడేవాళ్లు ఈ కోనేటిలోని నీటిని స్వీకరిస్తుంటారు. స్వామివారి పాద తీర్థం కనుక, వెంటనే ఫలితం కనిపిస్తుందని విశ్వసిస్తుంటారు. మంత్రం వేసినట్టుగా ఫలితాన్ని చూపుతుంది కనుక, ఈ కోనేరును 'మంత్ర బావి'గా చెప్పుకుంటూ వుంటారు. రామలింగేశ్వరుడితో కలిసి వేణుగోపాలుడు పూజాభిషేకాలు అందుకునే ఈ క్షేత్రాన్ని చూసితీరవలసిందే.

### లక్ష్మీదేవి నామస్మరణ ఫలితం

జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక్కో మెట్టూ ఎక్కుతూ అభివృద్ధిని సాధించాలని అనుకుంటారు. అందుకు అవసరమైన ప్రయత్నాలను కొన సాగిస్తూనే వుంటారు. ఎవరికైనా సరే అవసరాలు తీరాలన్నా .. అభివృద్ధిని సాధించాలని వున్నా అందుకు ఆర్థికపరమైన స్థిరత్వం ఎంతో అవసరం. ఆర్థికంగా బలంగా .. స్థిరంగా ఉన్నప్పుడే, ఏ పని చేయడానికైనా కావలిసిన ధైర్యం .. ఉత్సాహం కలుగుతుం టాయి.

లేదంటే ఆశయాన్ని సాధించే అవకాశం లేక నిరాశకి లోనుకావలసి వుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో నుంచి బయట పడటానికి లక్ష్మీదేవి అనుగ్రహం అవసరమవుతుంది. అందుకే అంతా ఆ తల్లిని పూజిస్తుంటారు .. భక్తి శ్రద్ధలతో సేవిస్తుంటారు. లక్ష్మీదేవి కరుణా కటాక్షాల కోసం .. అంతా ఆమెకి ఇష్టమైన విధంగా పవిత్రమైన జీవితాన్ని గడపడానికి సిద్ధపడుతుంటారు. ప్రతి శుక్రవారం పూజా మందిరంలోని అమ్మవారిని పూజించడమే కాకుండా, అమ్మవారి ఆలయాలను దర్శిస్తుంటారు. అయితే పూజా సమయంలో మాత్రమే కాకుండా, అనునిత్యం ఆ తల్లి నామాన్ని స్మరించడం వలన కూడా విశేషమైన ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబు తున్నాయి. తన నామాన్ని సదా ఎవరైతే స్మరిస్తూ ఉంటారో, వాళ్ల వెన్నంటే తాను ఉంటానని అమ్మవారే సెలవిచ్చినట్టుగా ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అమ్మవారి నామాన్ని భక్తి శ్రద్ధలతో ఎవరైతే సదా స్మరిస్తూ వుంటారో, వారి మనోభీష్టాలు నెరవేరడానికి అవసరమైన అవకాశాలను అమ్మవారు కల్పిస్తుందని చెప్పబడుతోంది. అమ్మవారి ప్రీతిని పొందితే .. ఆ తల్లి ఆ ఇంట స్థిరంగా వుండి పోతుందని స్పష్టం చేయబడుతోంది.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# పోరాటాలతోనే వేతనాల పెంపుదల

కొత్తగూడెం : పోరాటాల ఫలితంగానే సింగరేణిలో ఒప్పంద కార్మికుల వేతనాల పెంపుదల జరిగిందని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి ఎల్.విశ్వనాథం అన్నారు. ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటైన సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నైపుణ్యం లేని కార్మికులకు రూ.359, సెమీస్కిల్డ్ కార్మికులకు రూ.420, నైపుణ్య కార్మికులకు రూ.506, ఎక్కువ నైపుణ్యం ఉన్న కార్మికులకు రూ.593 చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఐకాస ఆధ్వర్యంలో జరిగిన అనేక ఆందోళనా కార్యక్రమాల ఫలితంగానే యాజమాన్యం స్పందించిందన్నారు. మోటారు వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు కె.వాసు, ఓబీ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పరమేశ్, గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు అలీముద్దీన్, నాయకులు రామటెంకె అశోక్, మల్లికార్జున్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# తవ్వకాలకు.. ఆన్‌లైన్‌లో అనుమతులు

## జీహెచ్ఎంసీలో ఆన్‌లైన్ అనుమతుల విధానం

హైదరాబాద్: రోడ్ల తవ్వకాల ప్రక్రియను సక్రమంగా జరిపేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. అందుకోసం ఆన్‌లైన్ అనుమతుల విధానాన్ని అందిపుచ్చుకుంది. దీని వల్ల పూర్తి ఆధారాలు పరిశీలించాకే రోడ్లను తవ్వేందుకు అనుమతి వస్తుంది. తవ్వకం పనులు ప్రారంభించే ముందే ప్రాంతం, ఏ రకం రోడ్డు అనే దాని ఆధారంగా బల్దియాకు రుసుము చెల్లించాలి. సకాలంలో పని పూర్తి చేసి రోడ్డును అప్పగిస్తే వెంటనే మరమ్మతులు చేస్తామని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.

జీహెచ్ఎంసీ అందిపుచ్చుకున్న ఆన్‌లైన్‌లో రోడ్డు తవ్వకం అనుమతులు విధానం ఇటీవల రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. నిబంధనల ప్రకారం స్థానిక సంస్థ లేదా ఆర్అండ్‌బీ అనుమతి లేకుండా రోడ్లను తవ్వకూడదు. జీహెచ్ఎంసీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అంతర్జాల అనుమతుల ప్రక్రియను చేపట్టింది.

ఆమేరకు ఇంజినీరింగ్ అధికారులకు ఉన్నతాధికారులు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనుమతుల్లేకుండా రోడ్లు తవ్వే వారిపై కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. అలా చేస్తేనే అనుమతులు తీసుకోడానికి ముందుకొస్తారని అన్నారు. ఇదే సమాచారాన్ని వేగంగా గుత్తేదారులకు చేరవేయాలన్నారు. సంస్థలకు ఈ నిబంధనలు అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నారు.

వారం రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. అనుమతి ఇచ్చే ముందు సంబంధిత సహాయక ఇంజినీరు లేదా కార్యనిర్వాహక ఇంజినీరు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారు చెప్పిన వివరాలు పరిశీలిస్తారు.

# రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

## విశ్రాంత ఐఏఎస్ ప్రభాకర్




నల్గొండ : రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులను కాపాడుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. నల్గొండ పట్టణంలోని నీలగిరి డిగ్రీ కళాశాలలో రాజ్యాంగం- పరిపాలన పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. రాజ్యాంగం ఎవరి సొత్తు కాదని అందరిదని పేర్కొన్నారు. విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్రకుమార్ మాట్లాడుతూ యువత ఓటు హక్కును పొంది వినియోగించుకుని అవినీతిరహిత సమాజాన్ని ఎన్నుకోవా లని కోరారు. అంతకు ముందు విశ్రాంత న్యాయమూర్తి, ఐఏఎస్‌లు చంద్రకుమార్, ప్రభాకర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నీలగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మారం నాగేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మధు, వెంకటరమణరెడ్డి, వివిధ సంఘాల నాయకులు కత్తుల నర్సింహ, కత్తుల శంకర్, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితే లక్ష్యసాధన

మెదక్: పట్టుదలతో చదివితే చదువులో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి డాక్టర్ నర్సింలు పేర్కొన్నారు. స్థానిక మాయా గార్డెన్స్‌లో జరిగిన సిద్ధార్థ ఆదర్శ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాబుద్ధులు నేర్పి భవిష్యత్తుకు బాటలు వేసే గురువులను గౌరవించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడంతో పాటు పోటీతత్వంతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం గడిచిన విద్యాసంవత్సరంలో ఇంటర్ వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రజ్ఞ, స్నేహ, సంధ్యలకు బహుమతులు ప్రదానం చేశారు. స్వాగత కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, అధ్యాపకులు మశ్చేంద్రనాథ్, సాయిబాబా, ప్రవీణ్, వెంకటేశ్, విజయ, ప్రతిభ, హేమలత పాల్గొన్నారు.

# రూ. 2 కోట్లతో చేపల మార్కెట్



మెదక్ : వ్యవసాయ అనుబంధ రంగమైన మత్స్యపరిశ్రమకు మెదక్ జిల్లా పేరు గాంచిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అటు మత్స్యకారులు, ఇటు ప్రజలకు సౌకర్యంగా ఉండేలా జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో రూ.2 కోట్లతో ఆధునిక చేపల మార్కెట్ నిర్మించనున్నట్లు ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో, పౌష్టికాహారమైన చేపలు విక్రయించేందుకు వీలుగా అన్ని హంగులతో దీనిని నిర్మిస్తామన్నారు. మండల పరిధి కొంటూర్ చెరువు వద్ద మత్స్యశాఖ ఏర్పాటుచేసిన మత్స్యకారుల అవగాహన సదస్సులో ఉపసభాపతి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వం అన్నికులాలు, అన్నివృత్తుల వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. జిల్లాలో పెంపకానికి అవసరమైన చేప విత్తనాన్ని పూర్తిస్థాయిలో మెదక్‌లోని మత్స్యక్షేత్రంలో ఉత్పత్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత విత్తనంతోపాటు, చేపల విక్రయానికి అనుగుణంగా ద్విచక్ర వాహనాలు, అవసరమైన ఐస్‌బాక్సులు, తూకపు యంత్రాలు తదితర సామగ్రి రాయితీపై అందజేస్తున్నామని తెలిపారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్య పాలనలో తెలంగాణలో మత్స్యపరిశ్రమ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం మత్స్యపరిశ్రమకు పెద్దపీట వేస్తోందన్నారు. ఈసారి నీటిపారుదలశాఖ చెరువులతోపాటు పంచాయతీరాజ్ చెరువులు, కుంటల్లో ఉచిత చేపవిత్తనం వదిలేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు గున్నాల నర్సింలు మాట్లాడుతూ ఈసారి జిల్లాలోని అన్ని వనరుల్లో కలిపి 4 కోట్ల చేపవిత్తనం వదలాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని సొసైటీలు ఉచిత చేపవిత్తన పథకాన్ని వినియోగించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో దళారుల వద్ద విత్తనం కొనుగోలు చేయొద్దన్నారు. జిల్లాకు అవసరమైన చేపవిత్తనం సరఫరాకు సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తయిందని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. 30 శాతం పైగా నీరుచేరిన చెరువుల్లో విత్తనం వదులుతారన్నారు. సమగ్ర మత్స్య అభివృద్ధి పథకం కింద జిల్లాకు రూ.32 కోట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చెరువుల్లో చేప విత్తనం వదిలే సందర్భంగా పరిశీలించాల్సిన అంశాలు, చేపల రవాణా సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార నైపుణ్యాలపై మత్స్యశాఖ అధికారులు వెంకన్న, నర్సింహారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీపీ లక్ష్మీ, మెదక్, రామాయంపేట ఏఎంసీ ఛైర్మన్లు కృష్ణారెడ్డి, నరేందర్, మెదక్ వైస్ ఛైర్మన్ అశోక్, మత్స్య సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ నర్సింహారావు, నీటిపారుదలశాఖ మెదక్ డీఈఈ శివనాగరాజు, ఏఈఈ శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి

### -జిల్లా జడ్జి ఎం.లక్ష్మణ్


ఖానాపురం : సెప్టెంబరు 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా జడ్జి ఎం.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పోలీసు అధికారులు, న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించే విషయంలో 2012కు ముందు కేసులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ముఖ్యంగా మధిర, సత్తుపల్లి పరిధిలో 2012 ముందు కేసులు ఎక్కువగా ఉన్నాయని వీటి పరిష్కారానికి పోలీసు అధికారులు మరింత సహకారం అందించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సెప్టెంబర్ ఒకటి నుంచి ముందస్తు లోక్ అదాలత్ ప్రక్రియ ప్రారంభమవుతుందని న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎన్.ప్రేమలత, కె.లలితకుమారి, బి.జ్ఞానేశ్వరరావు, ఎం. వెంకటరమణ, వినోద్‌కుమార్, అపర్ణాదేవి, రెహెనా, గీతారాణి, సౌమ్య, ప్రాసిక్యూటర్లు అదనపు డెరెక్టర్ ఎస్.కె. రామారావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వేతన చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలి

మహబూబ్‌నగర్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల వేతన చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ కోరారు. టీఎస్‌జీహెచ్ఎంఏ ఆధ్వర్యంలో జిల్లా కోశాగార డిప్యూటీ డైరెక్టర్ బి.వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ చెల్లింపులు వేగవంతంగా జరగాలి కానీ జిల్లాలో ఈ ప్రక్రియ మందకొడిగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జీఇఎచ్ఎంఏ జిల్లా కోశాధికారి జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్, సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## మాజీ మంత్రి సునీతారెడ్డి



మెదక్ : 12 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షురాలు సునీతారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద సెర్ప్ ఉద్యోగుల సమ్మెకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2013లో అప్పటి ప్రభుత్వం హెచ్ఆర్‌ను వర్తింపజేయాలని సూచించగా ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయని, కానీ ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని, కనీసవేతనం ప్రతి నెల రూ.18,500 చెల్లించాలని కోరారు. ఆరోగ్యభద్రత, ఆరోగ్య బీమా కల్పించాలని, ఆరోగ్యకార్డులు జారీ చేయాలని, మహిళా ఉద్యోగులకు సెలవుతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సెర్ప్ ఉద్యోగులు సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, సుప్రభాత్‌రావు, చంద్రపాల్, మధుసూదన్‌రావు, మామిళ్ల ఆంజనేయులు, కృష్ణగౌడ్, ఆంజనేయులుగౌడ్, రబిన్‌దివాకర్, శ్యాంప్రసాద్, హఫీజుద్దీన్, సంఘం జిల్లా అధ్యక్షురాలు నీల, బాధ్యులు అరవింద్‌కుమార్, మల్లేశం, భారతి, శ్వేత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను రక్షించుకుందాం



శాంతినగర్ : కేంద్రప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా విధివిధానాలు తెస్తోందని దాన్ని బ్యాంకు ఉద్యోగులంతా వ్యతిరేకించి ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకోవాలని యునైటెడ్ ఫ్రంట్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఏబీయూ) నాయకులు సూచించారు. బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులంతా కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ ప్రాంతంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట విధులను బహిష్కరించి కేంద్రప్రభుత్వ విధానంపై నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు నాయకులు కె.ధర్మేందర్, బి.హరికిషన్‌ను మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగాలు ఒకరోజు వేతనాన్ని త్యాగం చేసి సమ్మె చేపట్టామన్నారు. బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు.

దీంతో సామాన్య, పేదలకు బ్యాంక్ సేవలు భారమవుతాయన్నారు. ఒక వేళ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రైవేటీకరణ అయితే ఖాతాదారులు రూ.10 వేలతో ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. బ్యాంకుల నుంచి అధికమొత్తంలో రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ఉన్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టి వారి నుంచి డబ్బులు రికవరీ చేయించాలన్నారు. విదేశీ పెట్టుబడిదారులను బ్యాంకింగ్ రంగంలో నియంత్రించాలన్నారు. జీఎస్టీ పేరుతో బ్యాంకు సేవలపై వేసే ఛార్జీలను పెంచడం వల్ల సామాన్యులకు అది భారంగా మారుతుందున్నారు. నోట్ల రద్దు సమయంలో బ్యాంకులకు అయిన ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం కారుణ్య నియామకాల విషయంలో ఇతరశాఖల్లో అవలంభిస్తున్న విధానాలను బ్యాంకింగ్ రంగంలోనూ అమలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, ఆంధ్రా, మహారాష్ట్ర బ్యాంకు ఉద్యోగులు నవీన్, నూతన్, బాషా, షఫీ, రాజన్న, అశోక్, కె.స్వామి, ఆర్.రాంకిషన్, భగవాన్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర




మహబూబ్‌నగర్ : ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సాయిరెడ్డి ధ్వజమెత్తారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల సాధనకు ఈయూ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ డిపో ఎదుట చేపట్టిన ఒకరోజు దీక్షలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో రోజురోజుకు ప్రైవేటు బస్సుల సంఖ్య పెరుగుతోందని, గుర్తింపు సంఘం టీఎంయూ ప్రైవేటు బస్సుల టెండర్ల వ్యవహారాన్ని అడ్డుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 5 వేల ప్రైవేటు బస్సులను ఆర్టీసీలో కొనసాగించేందుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీలో ప్రైవేటు బస్సుల కొనసాగింపు చర్యలను నిరసిస్తూ ఈయూ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల ఉద్యోగ, కార్మికులతో కలిసి చలో ఆర్ఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు సాయిరెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఆర్టీసీలో ప్రైవేటు బస్సులను రద్దు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కార్మికులకు రావాల్సిన పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు మద్దతు ప్రకటించిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ సకల జనుల సమ్మెతో తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన ఆర్టీసీ కార్మికుల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

ఉద్యమ సమయంలో ఆర్టీసీలో ప్రైవేటీకరణ లేకుండా చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఎక్కడికక్కడ ఆర్టీసీలో అద్దె బస్సుల కొనసాగింపునకు పచ్చజెండా ఐపారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బాలకిషన్, ఈయూ జిల్లా కార్యదర్శి జి.సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు జబ్బార్, సంయుక్త కార్యదర్శి ఇంతియాజ్, డిపో కార్యదర్శి ఎస్ఎంపాషా తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాలకూ తప్పని పన్ను


## జీఎస్టీతో 20 శాతం పెరిగిన ధరలు

ఖమ్మం : వ్యాపార రంగంలో ఉన్న వారందరు జీఎస్‌టీతో ఒక్కో రకమైన సమస్యను వ్యక్తం చేశారు. కొన్ని రంగాల్లో జీఎస్‌టీతో ధరలు తగ్గగా మరికొన్ని రంగాల్లో పెరిగాయి. ఇదిలా ఉండగా జీఎస్‌టీ ప్రభావం వినాయకుడిపై కూడా పడింది. దీంతో విగ్రహాల ధరలు పెరిగాయి. ఈ పరిణామం మండపాలు ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులపై ఆర్థిక భారం పడింది. భారీ విగ్రహాలన్ని పీవోపీ, పీచు, ఇనుము, ఆయిల్ పెయింట్లతో రూపుదిద్దుకుంటుంది. ఈ ముడి సరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటున్న తయారీదారులు కొంత అధిక ఆర్థిక భారాన్ని మోసారు. దీంతో విగ్రహాల ధరలు పెంచారు. గత ఏడాది కంటే 20 శాతం ధరలు అధికంగా ఉన్నాయి. దీంతో భారీ విగ్రహాల విక్రయాలు గతేడాదితో పోల్చుకుంటే తగ్గాయి. గత అయిదేళ్లుగా ఖమ్మం, కొత్తగూడెం నగరాల్లో స్థానికంగా ఉండి భారీ విగ్రహాలు తయారు చేసుకుంటున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఏటా రెండు జిల్లాల్లో చిన్న పెద్ద విగ్రహాలు 14 వేల వరకు సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. భారీ విగ్రహాల తయారీకి అవసరమైన ముడి సరకులో రాజస్థాన్ రాష్ట్రం నుంచి పీవోపీ, పీచు కేరళ రాష్ట్రం, రంగులు మహారాష్ట్రలోని పుణే నగరం నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలో వచ్చిన వరదల కారణంగా సరకు రవాణాలో అనేక ఇబ్బందులు తలెత్తాయి. విగ్రహాల తయారీ మూడు నెలల ముందు నుంచే ప్రారంభించే తయారీ దారులు ముడి సకాలంలో చేరక ఇబ్బందులు పడ్డారు. సమయాభావంతో అనుకున్న సంఖ్యలో విగ్రహాలను తయారు చేయలేక పోయారు.

ముడి సరకుపై జీఎస్‌టీ ప్రభావం పడటంతో ఈసారి భారీ విగ్రాహాల తయారీ కత్తిమీద సాములా మారిందని రాజస్థాన్ నుంచి ఇక్కడికి వచ్చిన తయారీదారు మోహన్‌లాల్ చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్ నుంచి మొత్తం 38 కుటుంబాలు ఖమ్మం నగరంలో విగ్రహాల తయారీ పనిలో ఉన్నాయి. అనుకోకుండా వచ్చిన సమస్యలతో విగ్రహాల ధరలు పెంచక తప్పలేదని నిర్వాహకులు చెప్పారు. రకాలను బట్టి మూడు అడుగుల విగ్రహాలు రూ.3వేల నుంచి రూ.5వేలు, అయిదడుగుల విగ్రహాలు రూ.8వేల నుంచి రూ.12 వేలు, అతి భారీ రకాలు రూ.19వేల నుంచి రూ.31వేల వరకు ధరలు నిర్ణయించారు. భారీ విగ్రహాలు ముందుగా చెప్పిన వారికి మాత్రమే తయారు చేసి ఇస్తున్నామని తయారీదారులు చెప్పారు.

# బరువు తగ్గించే రాగి అంబలితో ఎన్నో లాభాలు..!

**ధాన్యపు గింజలైన రాగుల్లో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే రాగులతో తయారు చేసే అంబలిని తాగడం వల్ల మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా బరువు తగ్గుతారు. ఇంకా చాలా లాభాలే ఉన్నాయి. ఈ క్రమంలో రాగి అంబలిని ఎలా తయారు చేయాలో, దాంతో మనకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.**



రాగులను కొంత పరిమాణంలో తీసుకుని వాటిని కొన్ని గంటల పాటు నీటిలో నానబెట్టాలి. అనంతరం వాటిని శుభ్రమైన వస్త్రంలో కట్టి మళ్లీ కొన్ని గంటల పాటు ఉంచితే అవి మొలకెత్తుతాయి. కొన్ని సార్లు రాగులు మొలకెత్తడం ఆలస్యం కూడా అవచ్చు. అయినా కొంత సేపు నిరీక్షించి మొలకెత్తిన రాగులను సేకరించాలి. వాటిని బాగా ఎండబెట్టి దంచి పొడి చేయాలి. ఆ పొడిని కొంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. దీంతో జావ తయారవుతుంది. ఇందులో అవసరం అయితే జీడిపప్పు, పల్లీలు, కిస్మిస్, తేనె వంటివి కలుపుకోవచ్చు. లేదంటే ఉప్పు, కారం కూడా కలపవచ్చు. అలా కలుపగా వచ్చేదే రాగి అంబలి. దీన్ని నిత్యం తాగితే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

1. రాగి అంబలి శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది. రోజంతా శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు రాగి అంబలి ద్వారా అందుతాయి. దీంతో ఎక్కువ సేపు పనిచేయవచ్చు. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

2. ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు. చదువుల్లో బాగా ప్రతిభను కనబరుస్తారు. మెదడు చురుగ్గా ఉంటుంది.

3. రాగి అంబలికి చలువ చేసే గుణం ఉంది. దీంతో శరీరంలో ఉండే అధిక వేడిని తగ్గించుకోవచ్చు.

4. ఒక గ్లాస్ రాగి అంబలి తాగినా చాలా సేపు ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం ఎక్కువగా తినాలనిపించదు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. స్థూలకాయం ఉన్న వారు రాగి అంబలి తాగితే వేగంగా బరువు తగ్గవచ్చు.

5. ప్రతి రోజూ ఉదయం చేసే సాధారణ అల్పాహారానికి బదులుగా రాగి అంబలి తాగితే దాంతో మనం రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. శారీరక ద ృఢత్వం చేకూరుతుంది.

6. బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. రక్తస్రావం జరుగుతున్న వారికి రాగి అంబలి తాగిస్తే స్రావం ఆగిపోతుంది.

7. రాగి అంబలిని నిత్యం తాగుతుంటే పురుషుల్లో వీర్యం వ ృద్ధి చెందుతుంది.




# అనారోగ్య సమస్యలను మటుమాయం చేసే నువ్వుల నూనె...

**ఇప్పుడంటే అన్నీ రిఫైన్డ్ నూనెలు వచ్చాయి కానీ ఒకప్పుడు మన వాళ్లు గానుగల్లో ఆడించిన నూనెలనే ఎక్కువగా వాడేవారు. అలాంటి నూనెల్లో నువ్వుల నూనె కూడా ఒకటి. తెల్లనివి, నల్లనివి అని రెండు రకాలుగా ఈ నువ్వులు ఉంటాయి. వీటి నుంచి తీసే నూనెలో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్ ఇ, కాల్షియం, జింక్, ఐరన్, థయామిన్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో మనకు పుష్కలంగా లభిస్తాయి. ఈ క్రమంలో నువ్వుల నూనెను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**



1. నువ్వుల నూనెలో విటమిన్ ఇ, బిలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడమే కాదు, అన్ని రకాల చర్మ సమస్యలను దూరం చేస్తాయి. నువ్వుల నూనెను తరచూ వాడడం వల్ల ముఖం కాంతివంతమవుతుంది. చర్మం మ ృదువుగా మారుతుంది.

2. నిత్యం స్నానం చేసే ముందు చిన్న పిల్లలకు నువ్వుల నూనెతో మర్దనా చేస్తే వారి శరీరం బాగా ఎదుగుతుంది. మెదడు పదునుగా మారుతుంది. చిన్నారుల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. ఈ నూనెలో ఉండే పోషకాలన్నీ పిల్లలకు లభిస్తాయి. అయితే పెద్దలు కూడా స్నానానికి ముందు నువ్వుల నూనెతో మర్దనా చేసుకోవచ్చు.

3. నువ్వుల నూనెలో ఒమెగా-3,6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.

4. కాపర్, ఇతర పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో ఉంటాయి. దీంతో ఇవి కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

కొద్దిగా నువ్వుల నూనెను తీసుకుని కొంచెం వేడి చేసి మోకాళ్లపై రాసుకుంటే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.

5. పైన చెప్పిన విధంగా నువ్వుల నూనెను శరీరంపై కొవ్వు ఉన్న ప్రాంతాల్లో రాస్తే అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది.

6. నువ్వుల నూనెలో ఉండే పోషకాలు ఎముకలకు ద ృఢత్వాన్ని ఇస్తాయి. రక్తనాళాలను శుభ్రం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి.

7. మధుమేహ వ్యాధి గ్రస్తులు నిత్యం 2 టేబుల్ స్పూన్ల మోతాదులో నువ్వుల నూనెను ఏవిధంగానైనా తీసుకుంటే వారి శరీరంలోని రక్తంలో ఉండే చక్కెర స్థాయిలు తగ్గుముఖం పడతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది.

8. నువ్వుల నూనెతో తలకు మర్దనా చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. చుండ్రు సమస్య పోతుంది.

# మహిమాన్వితం.. శ్రీ మల్లీశ్వరుడు ఆలయం



పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాద్భుతమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివ ృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆల యం దినదినాభివ ృద్ధి చెందుతూ..భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. ఈకోవెల 6తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. -మహేశ్వరం

కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడేస్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమ ృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్టకామేశ్వరుడు, శ్రీముకేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణికరి?కేశ్వరుడు, శ్రీమహానందీశ్వరుడు, శ్రీఅమరావతీశ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష‘ంచారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

**చరిత్రకు నిలువుటద్దం గడికోట**

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చ్‌లతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అదుతేంగా నిర్మించారు.

**మహత్యం..త్రివ ృక్షం....:**


ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివ ృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవ ృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

**శివగంగకు దారి ఇలా..:**

ఆలయం హైదరాబాద్ నుంచి 25 కిలో మీటర్లు దూరంలో ఉంటుంది. ఫలక్‌నుమా, మిధాని, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఉంది. జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహేశ్వరానికి 253/90కె, చార్మినార్ నుంచి 253 ఎం, 253 కె, 253 టి, 253 హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఎ/ 253ఎం. జూబ్లీహిల్స్ నుంచి 253 ఎం, బస్సులు ఎక్కాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఔటర్‌రింగ్ రోడ్డు మీది నుంచి తుక్కుగూడ వరకు వచ్చి శ్రీశైలం రహదారి మీదుగా మహేశ్వరం గేట్ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఆలయ చరిత్ర...**


తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు



పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విషు? భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.

# 45 ఏళ్లు దాటితే..



అవును.. 45 ఏళ్లు పైబడితే మనుషుల్లో దాతృత్వ గుణం పెరుగుతుందని తాజా పరిశోధనలో వెలుగుచూసింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఓరెగాన్ నిర్వహించిన ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్తల్లో భారత సంతతి వ్యక్తి కూడా ఉన్నారు. వయసుతో పాటు దాతృత్వ గుణం కూడా పెరుగుతున్నట్టు వారి అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా 45 ఏళ్లు పైబడిన వారిలో ఆ గుణం ఎక్కువగా ఉంటున్నట్టు అధ్యయనకారులు గుర్తించారు. అధ్యయనం కోసం శాస్త్రవేత్తలు 18-67 ఏళ్ల వయసున్న 80 మంది స్త్రీపురుషులను ఎంచుకున్నారు. అది కూడా ఒకేరకమైన వృతి చేస్తున్నవారు, జీవితానుభవం ఉన్నవారిని. వారు ఏం చెబుతున్నారు అన్నదానిపై కాకుండా వారు ఏం చేస్తున్నారు అన్నదానిపై ఆధారపడి ఈ పరిశోధన నిర్వహించినట్టు ఓరెగాన్ యూనివర్సిటీకి చెందిన విలియం టి హర్బా తెలిపారు. అలాగే ఫంక్షనల్ మ్యాగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)ని ఉపయోగించి వారి మెదడును అధ్యయనం చేశారు. దాతృత్వానికి వారిని పురికొల్పుతున్నది ఏంటి అని తెలుసుకునేందుకు మెదడును పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. డబ్బును తనతో పాటు ఉంచుకున్నప్పుడు కొందరి నాడీ ప్రాంతాలు(న్యూరల్ రివార్డ్స్) చాలా యాక్టివ్‌గా, మరి కొందరిలో మామూలుగా ఉన్నట్టు గుర్తించారు. 45 ఏళ్లు దాటిన వారిలో ఇతరులతో పోలిస్తే న్యూరల్ రివార్డ్లు చాలా బాగా ఉన్నట్టు గుర్తించినట్టు సంజయ్ శ్రీవాస్తవ వివరించారు. ఈ అధ్యయనం జర్నల్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ సైకాలజీలో ప్రచురితమైంది.

# శివగంగ.. పర్యాటకంగా!

పల్లె.. పట్నం కలగలిపిన సరికొత్త ట్రావెల్ జోన్ మహేశ్వరం! ఆ మహేశ్వరంలో వెలసిన ఆకాశగంగ.. శివగంగ. ఐదు వందల అడుగుల పొడవు, రెండు వందల యాభై అడుగుల వెడల్పు జలాశయం.

హైదరాబాద్ సమీపంలోని ఈ నేల అబూహసన్ తానీషా కాలంలో పర్యాటకంగా విరాజిల్లింది. అక్కన్న, మాదన్నలు తిరుగాడిన.. ఛత్రపతి శివాజీ అడుగిడిన పుణ్యభూమి ఇది! ఆహ్లాదంతో పాటు.. అలనాటి చరిత్ర తెలుసుకునే భాగ్యం కలిగే పర్యాటక ప్రాంతం.

మహేశ్వరం హై కాస్ట్ రియల్ ఎస్టేట్‌కు పెట్టింది పేరు. బంగారం పండే నేలలుగా అందరికీ సుపరిచితం ఈ ప్రాంతం. ఒకవైపు పెంకుటిండ్లు ఉంటాయి. మరోవైపు హైక్లాస్ విల్లాలుంటాయి. పేదల పశువుల పాకల పక్కనే పట్నంవాసుల ఫామ్ హౌజ్‌లుంటాయి. స్పెషల్ ఎకనమికల్ జోన్లు ఒకవైపు.. ప్రత్యేకాదాయాన్నిచ్చే పండ్ల.. పూదోటలు మరోవైపు కనిపిస్తాయి. ఇంజినీరింగ్ కళాశాలలు.. అణుశక్తి తయారీ కేంద్రాలకు పెట్టింది పేరు. ఇలాంటి మహేశ్వరాన్ని చూసేందుకు విదేశీ బ ృందాలు కూడా వచ్చాయంటే అతిశయోక్తి కాదు. మనిషన్నాక మహేశ్వరంలో గజం స్థలం సంపాదించాలి అనుకొనే ఖరీదైన భూమి. పచ్చని పంటపొలాలు.. విశాలమైన రోడ్లు.. అన్నిటికంటే మించి పల్లె.. పట్నం కలగలిసిన ప్రాంతంగా రియల్ ఎస్టేట్ వెంచర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన మహేశ్వరానికి గొప్ప చరిత్ర ఉన్నది. చరిత్ర లోతుల్లోకి వెళ్లి చూస్తే.. అబ్బుర పరిచే సన్నివేశాలెన్నో మన కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తాయి. మహేశ్వరంలోకి అడుగుపెట్టగానే ముందుగా చూడాల్సిన ద ృశ్యం శివగంగ!

**జలగంగ..**

ఆ ఊరిపేరు ఇప్పుడు మహేశ్వరం. ఒకప్పుడు మహంకాలి మహేశ్వరం. హైదరాబాద్‌కి 28 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పేరులోనే మహేశ్వరుడున్న ఊరు అది. ఇప్పుడు ఆ ఊరు మాంఖాల్, మహేశ్వరంగా అనే రెండూళ్లుగా విడిపోయింది. శతాబ్దాల కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీ ఏలుబడితో ప్రత్యక్ష.. పరోక్ష అనుబంధమున్న ప్రాంతమిది. పార్వతీ పరమేశ్వరులు కొలువున్న ఊరు. మహేశ్వరం అనగానే ఇప్పుడు మనకు రియల్ ఎస్టేట్ వెంచర్లు మాత్రమే గుర్తొస్తాయి. మహేశ్వరం నడిబొడ్డున మడుగుగా కనిపిస్తున్న కోనేరు కనిపిస్తుంది. అదే అలనాటి రాజరాజేశ్వరుని కోనేరు శివగంగ! అయిదు వందల అడుగుల పొడవు, రెండు వందల యాభై అడుగుల వెడల్పు ఉన్న జలాశయం ఇది. గంగను జటలో పట్టిన శివుడు.. గంగనీటితో స్నానమాచరించిన చోటు. అంటే శివుడి తలభాగంలో కాకుండా గంగలోనే శివుడు వెలిశాడు ఇక్కడ. కాకతీయుల కాలంలో నిర్మాణం జరిగి.. సౌందర్యోపాసకులను కట్టిపడేసే మహత్తుగలిగిన శివగంగ ఆలయం పద్మాకారంలో ఉంటుంది. గంగ మధ్యలోనున్న శివాలయం చుట్టూ చిన్న చిన్న ఆలయాలు పద్మ రేకుల్లా ఉంటాయి. శివ పార్వతుల ఆలయాలతో పాటు మొత్తం 18 ఆలయాలు.. శివగంగకు నాలుగువైపులా 18 మెట్లు నిర్మించారు.

**ఆధ్యాత్మిక కేంద్రం..**

మహేశ్వరం పరిసర ప్రాంతాలు ఆ రోజుల్లో ఆధ్యాత్మిక శోభతో భాసిల్లినట్లు నేటికీ కొన్ని ఆధారాలున్నాయి. అక్కన్న మాదన్నల కాలంనాడే ఇక్కడ మరికొన్ని ఆలయాలు వెలసినట్లు చరిత్రకారులు చెప్తున్నారు. నేటి మహేశ్వరంలో ఏదో ఒక చోట శివలింగాలు బయల్పడటమే దీనికి నిదర్శనం. మహేశ్వరంలో అక్కన్న పూజించిన కోదండ రామాలయం, శివగంగ, విషు?గంగ అనే కోనేర్లు, వీరమ్మ కుంట అనే చెరువు, వారు కట్టించిన ఒక పెద్ద కోట ఉండేవి. పక్కనే ఉన్న ఫకీర్‌గూడలో హనుమాన్ దేవాలయాన్ని కూడా కట్టించారు. అక్కన్న మాదన్న, తానీషాల యుగం దక్షిణాదిన హిందూ, ముస్లీం సమైక్యతకు నిదర్శనమని ఈ కట్టడాలు.. ఇప్పుడు లభిస్తున్న ఆనవాళ్లు చెప్తున్నాయి. ఈ ప్రాంతమంతా మందిరాలు.. మఠాలతో విలసిల్లింది. ప్రజలు కూడా సుఖంగా ఉండేవారు. కానీ ఇప్పుడు చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న ఆ కట్టడాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ సుందర కట్టడాలను చూసేందుకు వచ్చిన సందర్శకులకు శివగంగ తెలియని చరిత్రగానే మిగిలిపోయింది. కనీసం చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లకైనా శివగంగ గొప్పదనం గురించి ఇక్కడి వందల ఏళ్లనాటి సైనికుల కత్తుల ఖణఖణలు.. గుర్రాల గిట్టల చప్పుళ్లు.. శతఘ్నుల భీకర శబ్దాలు.. గుర్రాలపై తిరగాడిన అక్కన్న మాదన్నల వైభవం.. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ పర్యటన తెలియకుండానే ఉన్నది. ఇవన్నీ తెలిస్తేనే.. శివగంగ ప్రణవనాదాలతో వాతావరణం నిండిపోగా.. మనసు గుడి ఆహ్లాదకరంగా మారితే మహేశ్వరం మంచి పర్యాటకంగా అభివ ృద్ధి చెందుతుంది!

**ఛత్రపతి రాక..**

అబూహసన్ తానీష ఆహ్వానం మేరకు గోల్కొండ వచ్చిన మరాఠా మహావీరుడు ఛత్రపతి శివాజీ అక్కడ కొన్నాళ్లు ఉన్నాడు. గోల్కొండలో ఉన్న కాలంలో ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలాన్ని దర్శించుకునేందుకు శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ గ్రామాల మీదుగా బయలుదేరాడు. ఆయన పరిజనంతో మాంఖాల్ మహేశ్వరం, జిన్నాయిగూడ నరసింహస్వామి దేవాలయం కూడా దర్శించుకున్నాడు. జిన్నాయిగూడెంలో శివాజీ ఒక కోటను కూడా కట్టించుకున్నాడట. ఆ కోట అవశేషాలు ఇప్పటికీ ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు. మరాఠా యోధుడు శివాజీని ఆహ్వానించడం.. గోల్కొండలో ఆయన చిత్రపటాన్ని ప్రతిష్టించడం.. సుల్తానుల రాజ్య విస్తరణను అణగదొక్కాలనే ప్రణాళిక వేయడంతో గోల్కొండ రాజ్యంపై ఔరంగాజేబు దాడిచేశాడు. దాంట్లో భాగంగానే గోల్కొండతో అనుబంధమున్న శివగంగపై కూడా దాడిచేసి గుడిని ధ్వంసం చేసి శివలింగాన్ని కోనేరులో దాచిపెట్టారని స్థానికులు అంటున్నారు. అప్పటి నుంచి ఆ ఊరు పేరుకే మహేశ్వరం. ఊళ్లో మహంకాళి గుడి ఉన్నది. మహేశ్వరుడు లేడు. గుడికి కొద్ది దూరంలో గడి.. గడిలో రాముడు లేని గుడి.. ఒక మూలన అమ్మవారి చిన్న గుడి.. ఆ పక్కనే గడిలో అలనాటి మసీదు.. ఇంకోపక్క గడిలో స్కూలు.. ఆ పక్కనే పంచాయతీ ఆఫీసు.. శతాబ్దాల నాటి చరిత్రకు మూగ సాక్షులుగా మారిపోయాయి! అయితే 1980 ప్రాంతంలో శంకర్‌ఖత్రీ అనే ఉపాధ్యాయుడు కొలనులో దాచిపెట్టిన శివలింగాన్ని తీసి పునఃప్రతిష్టించాడు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మించాడు. శివగంగకు కొంత వైభవాన్ని తీసుకొచ్చాడని స్థానికులు చెప్తుంటారు!

## రియల్ లైఫ్‌లో...
# ఐశ్వర్యరాయ్‌కి విలన్ అతడే..



ఇండియ్ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ ఐశ్వర్యరాయ్. తన అందం, నటనతో ప్రపంచ వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ బిగ్ బి తనయుడు అభిషేక్ బచ్చన్‌ను ప్రేమ వివాహం చేసుకుని సెటిలైన సంగతి తెలిసిందే. పెళ్లికి ముందు ఐశ్వర్యరాయ్ జీవితం చాలా ఆసక్తికరం.

సల్మాన్ ఖాన్‌తో ఆమె ప్రేమాయణం సంచలనం. వీరి మధ్య జరిగిన బ్రేకప్ అప్పట్లో సెన్సేషన్. బ్రేకప్ సమయంలో ఇద్దరూ ఒకరిపై ఒకరు సంచలన ఆరోపణలు చేసుకున్నారు. ఐశ్వర్యరాయ్ మానసికంగా క ృంగిపోయింది. సల్మాన్ ఖాన్ కొంతకాలం పిచ్చోడిలా ప్రవర్తించాడనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఐశ్వర్య రాయ్‌కి రియల్ లైఫ్‌లో విలన్ లాంటి వ్యక్తి ఎవరైనా ఉన్నారా? అంటే చాలా మంది చెప్పే పేరు సల్మాన్ ఖాన్. సల్మాన్ ఖాన్ లైఫ్‌లో కూడా ఐశ్వర్యరాయ్ మరిచిపోలేని పీడకల.


ఒకప్పుడు ఇద్దరూ కలిసి బాలీవుడ్లో హిట్స్ కొట్టిన ఐశ్వర్యరాయ్, సల్మాన్...... బ్రేకప్ గొడవ తర్వాత కలిసి నటించింది లేదు. అయితే చాలా కాలం తర్వాత ఈ ఇద్దరినీ కలిపి సినిమా తీయాలనే ప్రయత్నం చేశారు బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ.

## చిత్రభాను

# బాగా సంపాదిస్తున్న హీరోల్లో ముగ్గురు మనోళ్లే.....







ప్రపంచ ప్రఖ్యాత మేగజైన్ ఫోర్బ్స్ ప్రతి ఏడాది వివిధ రంగాల్లో బాగా సంపాదిస్తున్న సెలబ్రిటీల వివరాలు సేకరించి ప్రచురిస్తున్న సంగతి తెలిసిందే. అందులో సినిమా రంగానికి చెందిన వారి వివరాల కోసం ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఎదురు చూస్తూ ఉంటారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ప్రపంచ వ్యాప్తంగా బాగా సంపాదిస్తున్న యాక్టర్ల లిస్టును తాజాగా విడుదల చేసింది ఫోర్బ్స్ మేగజైన్. 2016 జూన్ 1 నుండి 2017 జూన్ 1 మధ్య కాలంలో వివరాలను బేస్ చేసుకుని ఈ లిస్టు రిలీజ్ చేశారు.

ఫోర్బ్స్ విడుదల చేసిన లిస్టులో టాప్ 10 లో మన ఇండియన్ స్టార్స్ ముగ్గురు ఉండటం గమనార్హం. మరి ఆ హీరోలు ఎవరు? ఎవరెవరు ఎంత సంపాదించారు? అనే వివరాలపై ఓ లుక్కేద్దాం.

ఇండియన్ స్టార్ షారుక్ ఖాన్ 38 మిలియన్ డాలర్ల సంపాదనతో 8వ స్థానంలో ఉన్నారు. షారుక్ సంపాదన రూ. 243.5 కోట్లు.

సల్మాన్ ఖాన్ బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ 37 మిలియన్ డాలర్ల సంపాదనతో 9వ స్థానంలో ఉన్నారు. సల్మాన్ ఖాన్ సంపాదన రూ. 237 కోట్లు.

అక్షయ్ కుమార్ బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ 35.5 మిలియన్ డాలర్ల సంపాదనతో 10వ స్థానంలో ఉన్నారు. అక్షయ్ సంపాదన రూ. 227.5 కోట్ల రూపాయలు.

# మహేష్ బాబు 'స్పైడర్'... పుచ్చకాయ... పుచ్చకాయ!



టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'స్పైడర్'. రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్ జోరందుకున్నాయి. స్పైడర్ చిత్రానికి సంబంధించి ఇటీవల 'బూమ్ బూమ్' అనే తొలిపాటను రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. త్వరలో మరో పాటను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. మొదట విడుదల చేసిన పాటకు భిన్నంగా ఈ సాంగ్ ఉండబోతోంది. 'పుచ్చకాయ పుచ్చకాయ' అనే లిరిక్‌తో రెండో పాట ఉంటుందని సమాచారం. ఈ పాటను ప్రముఖ బాలీవుడ్ గాయకుడు బ్రిజేశ్ శాండిల్య పాడారు. బ్రిజేశ్ 'సరైనోడు' టైటిల్ సాంగ్‌తో తెలుగు ప్రేక్షకులకు గాయకుడిగా పరిచయమైన సంగతి తెలిసిందే.

పుచ్చకాయ..పుచ్చకాయ' పాట అరబిక్ లిరిక్స్‌తో వెరైటీగా ఉంటుందని, ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని చిత్ర యూనిట్ సభ్యులు అంటున్నారు. తమిళ్, మలయాళం, అరబిక్‌లో భాషలో సినిమా రిలీజ్ అవుతుంది కాబట్టే ఇలా అరబిక్ లిరిక్స్ తో పాట పెట్టారట. స్పైడర్ చిత్రానికి హ్యారిస్ జైరాజ్ సంగీతం అందిస్తున్నారు.

ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఎన్.వి.ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. సెప్టెంబర్ 27న విడుదల కాబోతోంది.

సినిమా ప్రారంభంలోనే తెలుగు, తమిళంలోనే చేయాలనుకున్నాం. హిందీలో చేయమాలనుకోలేదు. తెలుగు, తమిళంలో ఏకకాలంలో షూట్ చేయడం వల్ల నేను వేసిన ప్లానింగ్ కంటే షూటింగ్‌కు ఎక్కువ రోజుల సమయం పట్టింది. ఒకేసారి రెండు భాషల్లో సినిమా చేయడం నాకు మొదటిసారి. రెండు భాషల్లో అయితే నేను మేనేజ్ చెయగలను... అందుకే హిందీలో చేయలేదని దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెలిపారు.

# హలో అంటున్న అఖిల్



అఖిల్ కథానాయకుడిగా విక్రమ్.కె. కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్నది. అన్నపూర? స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి హలో అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కొన్ని రోజులుగా ఈ టైటిల్ పట్ల చిత్ర వర్గాలతో పాటు అక్కినేని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల తాను నటించిన నిర?యం సినిమాలోని హలో గురూ ప్రేమకోసమేరోయ్ జీవితం అనే గీతాన్ని ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు నాగార్జున. ఆ పాట పల్లవిలోనే సినిమా టైటిల్ దాగి ఉందని చెప్పారు. దీనిపై మరిన్ని వివరాల్ని నాగచైతన్య, సమంత వెల్లడిస్తారంటూ ప్రకటించారు. ఆ తర్వాత రోజు ఏ మాయ చేసావేలోని హొసన్నా అనే పాటను ట్విట్టర్ ద్వారా షేర్ చేసిన నాగచైతన్య కూడా ఈ పాటలోనే టైటిల్ ఉందని, చాలా బాగుందని వెల్లడించారు. దాంతో రెండు పాటల్లో హలో అనే పదం కామన్‌గా ఉండటంతో అదే ఈసినిమా టైటిల్ అంటూ ప్రచారం జరిగింది. ఆ అంచనాలకు అనుగుణంగానే హలో అనే పదాన్నే టైటిల్‌గా నిర?యించారు నిర్మాత నాగార్జున.

టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను సోమవారం ట్విట్టర్ ద్వారా ఆయన విడుదల చేశారు. ఎన్టీఆర్, ప్రభాస్, రానా, రాజమౌళితో పాటు పలువురు సినీ ప్రముఖులు చిత్రబ ృందానికి శు భాకాంక్షలు అందజేసిన వీడియోను పంచుకున్నారు. ఇందులో అర్ యూ రెడీ నాన్న మీరే చెప్పండి అనే మాటను నాగార్జున చెప్పగానే దివంగత నటుడు నాగేశ్వరరావు హలో హలో అంటూ వీడియోలో కనిపించి చెప్పిన మాటలు అభిమానుల్ని అలరిస్తున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనూప్ రూబెన్స్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్రంలో అఖిల్ ఓ గీతాన్ని ఆలపించారు.

### కంప్యూటర్ ప్రోగ్రామర్‌కు
# 25 ఏళ్ల జైలు శిక్ష



డెస్‌మోయిన్స్: అమెరికాలో మాజీ కంప్యూటర్ ప్రోగ్రామర్ ఎడ్డీ టిప్టన్‌కు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది ఐయోవా కోర్టు. ప్రోగ్రామర్ టిప్టన్ లాటరీ టికెట్లను కొనేవాళ్లను మోసం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. లాటరీ కొన్న నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలను సుమారు రూ.14 కోట్ల వరకు చీట్ చేశాడతను. ఎవరు లాటరీ కొన్నా.. ఆ లాటరీలు తనకు వచ్చేటట్లుగా కంప్యూటర్ ప్రోగ్రామ్‌ను డిజైన్ చేశాడు టిప్టన్. ఆరేళ్లుగా అతను ఇలా లాటరీ కొన్నవాళ్లను చీట్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఐయోవా రాష్ట్రానికి చెందిన లాటరీ సంస్థకు టిప్టన్ ఐటీ మేనేజర్‌గా చేశాడు. లాటరీ కొనేవాళ్లు తమకు కావాల్సిన నెంబర్లను కంప్యూటర్ ద్వారా పిక్ చేసుకుంటారు. అయితే నిందితుడు టిప్టన్ కంప్యూటర్ ప్రోగ్రామర్ కావడం వల్ల, చాలా వరకు లాటరీలు తమ కుటుంబసభ్యులకే దక్కే విధంగా ప్రోగ్రామ్‌ను డిజైన్ చేశాడు. పవర్‌బాల్, మెగా మిలియన్స్, హాట్ లొట్టో లాంటి లాటరీ సంస్థలకు టిప్టన్ ప్రోగ్రామ్ రాశాడు.

### ఈ హార్డ్ డిస్క్ కెపాసిటీ..
# 20,480 జీబీ..!



అవును మీరు విన్నది నిజమే. వెస్టర్న్ డిజిటల్ సంస్థ తయారు చేసిన ఈ ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్క్ కెపాసిటీ అక్షరాలా 20టీబీ. అంటే 20,480 జీబీ అన్నమాట. మై బుక్ డ్యుయో పేరిట ఈ హార్డ్ డిస్క్ విడుదలైంది. కాగా ఈ హార్డ్ డిస్క్ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ స్టోరేజ్ స్పేస్ కలిగిన ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్క్ గా రికార్డుకెక్కింది. దీన్ని డెస్క్‌టాప్ కంప్యూటర్లకు యూఎస్‌బీ పోర్టు ద్వారా అనుసంధానించుకోవచ్చు. 360 ఎంబీ పర్ సెకండ్ గరిష్ట స్పీడ్‌తో ఇందులో డేటాను రీడ్, రైట్ చేసుకోవచ్చు. ఇక ఈ హార్డ్ డిస్క్‌కు యూఎస్‌బీ టైప్ సి, టైప్ ఎ హబ్ పోర్టులను ఇచ్చారు. దీంతో ఈ డిస్క్‌కు యాక్షన్ కెమెరాలు, కార్డ్ రీడర్లు, కీబోర్డులు, మౌస్‌లు, ఇతర యూఎస్‌బీ డ్రైవ్‌లు, ఫోన్లు వంటి వాటిని కనెక్ట్ చేసుకోవచ్చు. ఈ హార్డ్ డిస్క్ ధర రూ.54,460గా ఉంది.

కేవలం 20టీబీ సైజ్‌లో మాత్రమే కాకుండా ఇదే హార్డ్ డిస్క్ సిరీస్‌లో 16టీబీ, 12టీబీ, 8టీబీ, 6టీబీ, 4టీబీ కెపాసిటీ ఉన్న ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్క్‌లను కూడా వెస్టర్న్ డిజిటల్ విడుదల చేసింది. ఇవి వరుసగా రూ.40,365, రూ.28,190, రూ.22,425, రూ.19,220, రూ.17,940 ధరలకు వినియోగదారులకు లభిస్తున్నాయి.

# నిమ్స్‌లో ఈహెచ్‌ఎస్ సేవల పరిశీలన



పంజాగుట్ట: నిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగులకు, పింఛనుదారులకు అందించే ఈహెచ్‌ఎస్ సేవలను తెలంగాణ రాష్ట్ర టీఎన్‌జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ నగర అధ్యక్షుడు ప్రతాప్ పరిశీలించారు. నిమ్స్ సంచాలకులు డా.కె.మనోహర్‌తో కలిసి నూతనంగా ప్రారంభమైన గదులను సందర్శించారు. ఈహెచ్‌ఎస్ సేవలు పొందుతున్న వివరాలను ఆరా తీశారు.ఈహెచ్‌ఎస్ సేవలను మరింత విస్తృతం చేసి ఆ విభాగానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘం రాష్ట్ర నేతలు, గ్రేటర్ నేతలు మార్త రమేష్, సత్యగౌడ్, పి.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన ఘనతకు చేరువలో కోహ్లి



దిల్లీ: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనతకు చేరువయ్యాడు. గురువారం భారత్-శ్రీలంక మధ్య జరగబోయే రెండో వన్డేలో కోహ్లి ఈ ఘనతను సాధించే అవకాశం ఉంది. ఇంతకీ అదేంటంటే.. ఒక క్యాలెండర్ ఇయర్‌లో వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించడం. ఇప్పటి వరకు కోహ్లి ఈ క్యాలెండర్ ఇయర్‌లో 769(14 వన్డేల్లో) పరుగులు సాధించి మూడో స్థానంలో ఉన్నాడు.

దక్షిణాఫ్రికా ఆటగాడు డుప్లిసెస్ 814(16 వన్డేల్లో) పరుగులతో అగ్రస్థానంలో ఉండగా ఇంగ్లాండ్ సారథి రూట్ 785(14 వన్డేల్లో) పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. డుప్లిసెస్ కంటే 45, రూట్ కంటే 16 పరుగుల వెనుకంజలోనే కోహ్లి ఉన్నాడు. లంక ఆటగాళ్లపై తొలి వన్డేలో విరుచుకుపడిన కోహ్లి రెండో వన్డేలోనూ అదే ప్రదర్శన పునరావృత్తం చేస్తే డుప్లిసెస్, రూట్ రికార్డులు బద్దలవ్వడం ఖాయం. దీంతో వన్డేల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా కోహ్లి నిలుస్తాడు. ఆ తర్వాత కూడా కోహ్లి రికార్డు బద్దలవ్వడానికి అవకాశమే లేనట్లుగా కనిపిస్తోంది. ఎందుకంటే భారత్-శ్రీలంక మధ్య మిగతా వన్డేలు జరగాల్సి ఉంది. ఆ తర్వాత డిసెంబరు చివరి నాటికి ఆస్ట్రేలియా, శ్రీలంకతో సుమారు 11 వన్డేలు ఆడాల్సి ఉంది. సెప్టెంబరులో ఇంగ్లాండ్-వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్ జరగనుంది. క్యాలెండర్ ఇయర్ ముగిసే నాటికి కోహ్లి తన ఫామ్‌ని కొనసాగిస్తే వెయ్యి పరుగులు దాటే అవకాశం కూడా ఉంది.

# ఆయుధాలతో 30 వేల మంది.. రెండు రాష్ట్రాల్లో హైఅలర్ట్!



చండీగఢ్: ఒక వ్యక్తిపై ఉన్న రేప్ కేసులో ఈ నెల 25న కోర్టు తీర్పు.. కానీ దానికి మూడు రోజుల ముందు నుంచే రెండు రాష్ట్రాల్లో హైఅలర్ట్. పోలీసుల వెన్నులో వణుకు పుడుతున్నది. ఇప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు హైఅలెర్ట్‌లో ఉన్నాయి. దీనికి కారణం డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌పై ఉన్న రేప్ కేసులో ఎల్లుండి (శుక్రవారం) సీబీఐ కోర్టు తీర్పు చెప్పనుంది. ఈలోపే సెక్టార్ 23లో ఉన్న ఆ ఆధ్యాత్మిక సంస్థ కార్యాలయం నామ్ చర్చా ఘర్‌కు అతని ఫాలోవర్లు భారీగా చేరుకుంటున్నారు. ఇప్పటికే 30 వేల మంది ఆయుధాలతోపాటు అక్కడికి చేరుకున్నారు. పెట్రోల్, డీజిల్‌లను నిల్వ చేస్తున్నారు. తీర్పు ప్రతికూలంగా వస్తే విధ్వంసం సృష్టించేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీంతో పంచకుల పోలీసులు ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాదు గంటగంటకూ వచ్చేవారి సంఖ్య భారీగా పెరుగుతున్నది. కోర్టుకు గుర్మీతే హాజరుకావాలని ఆదేశాలు ఉండటంతో అతని అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సెక్టార్ 23 వరకు అతని ఫాలోవర్స్ వస్తే ఎలాగోలా మేనేజ్ చేయవచ్చుగానీ.. పంచకుల నగరంలోకి వస్తే మాత్రం ఆందోళన తప్పదని పోలీసులు చెబుతున్నారు.

మరోవైపు సెక్టార్ 16లోని క్రికెట్ స్టేడియాన్ని ఒకరోజు కోసం జైలుగా వాడటానికి చండీగఢ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో పది వేల మందిని బంధించే అవకాశం ఉంటుంది. ఆ రోజు ఎవరు చట్టాన్ని అతిక్రమించినా.. వాళ్లను జైల్లో వేస్తామని ఓ అధికారి స్పష్టంచేశారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సెలవుల్లో ఉన్నవారిని వెంటనే ఉద్యోగాల్లో చేరాల్సిందిగా ఆదేశించారు. డేరా సచ్చా సౌదాకి లక్షల సంఖ్యలో అనుచరులు ఉన్నారు. అందులో మహిళలు, బాలికలే ఎక్కువ కావడం గమనార్హం.

## ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరం



కవాడిగూడ: దక్షిణాది రాష్ట్రాల స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వచ్ఛ భారత్ శిబిరం ముగిసింది. దోమలగూడలో జరిగిన ఐదు రోజుల శిబిరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల బాలబాలికలు పాల్గొన్నారు. చివరి రోజు పరస్పరం కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఎవరి ప్రాంతానికి వారు బయలుదేరారు. జాతిపిత మహాత్మాగాంధీ 150 జయంతి(2019) నాటికి దేశమంతటిని స్వచ్ఛంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమానికి సంబంధించిన అంశాల్లో స్కౌట్స్, గైడ్స్ బాలబాలికలకు శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది.

# హెల్మెట్‌తోనే మనకు రక్షణ



మహబూబాబాద్: మన రక్షణ కోసం, మనల్ని నమ్ముకున్న కుటుంబం కోసం హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ ప్రీతిమీన అన్నారు. స్థానిక రైల్వే సెంటర్‌లో ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియం నుంచి హెల్మెట్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రీతిమీన, ఎస్పీ కోటిరెడ్డి ప్రారంభించారు. సుమారు 500 మంది హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 75 రోడ్డు ప్రమాదాలు జరిగితే అందులో 40 మంది మృత్యువాత పడ్డారని వివరించారు అందరూ హెల్మెట్ ధరించేలా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. డీటీవో భద్రునాయక్, జిల్లా అబ్కారీ అధికారి దశరథ్ , డీఈవో నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు రాజమహేంద్రనాయక్, రాజారత్నం మాట్లాడారు. ఈ సందర్భంగా బండ వెంకన్న కళాకారుల బృందం జబర్దస్త్ రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# డోక్లామ్ నేర్పుతున్న పాఠాలు..!



ఎదురుదెబ్బలు తిన్న మనిషి కచ్చితంగా రాటుదేలుతాడు. ఇది దేశాలకు కూడా వర్తిస్తుంది.. ప్రస్తుతం మన దేశం పరిస్థితి కూడా ఇలానే ఉంది. 1962లో చైనా యుద్ధం ముగిశాక పాక్‌తో యుద్ధాలు జరిగినా వాటిల్లో భారత్ సునాయాసంగా విజయం సాధించింది. మరోపక్క పాక్‌తో పోల్చుకుంటే చె%నా సరిహద్దుల్లో ఎక్కువ కవ్వింపులు లేవనే చెప్పాలి. అడపాదడపా భారత్ భూభాగాల్లోకి చొరబడటం.. వెనక్కి వెళ్లటం మినహా పెద్ద సంఘటనలు ఏవీ చోటు చేసుకోలేదు. దీంతో గత ప్రభుత్వాలు సైనిక ఆధునికీకరణ విషయంలో కొంత నిదానంగా వ్యవహరించాయనే చెప్పాలి. కీలక ప్రాజెక్టులకు సంబంధించిన కొనుగోళ్లు.. అనుమతుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకునేది. ఒక ఆయుధ కొనుగోలు ఒప్పందం కుదిరితే అది సైన్యం చేతికి వచ్చేందుకు కొన్నేళ్లు పట్టేది. మోదీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితిలో మార్పు వచ్చింది. దేశీయంగానే ఆయుధ తయారీకి ప్రాధాన్యమిస్తూ వచ్చారు. కానీ పాక్ వైపు నుంచి కవ్వింపు చర్యలు పెరుగుతుండగా.. మరోపక్క చైనా కూడా దుందుడుకు వె%ఖరిని అవలంభిస్తోంది. ఈ రెండు దేశాలు చట్టాపట్టాలేసుకొని నడుస్తుండటంతో భారత్ భద్రతపై ఒత్తిడి పెరిగింది. ఇదే సమయంలో భారత్-భూటాన్-చైనా సరిహద్దుల్లో డోక్లామ్ కూడలి వద్ద చైనా బలగాలు రహదారి నిర్మాణం చేపట్టాయి. దీంతో భారత్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో కలిపే చికెన్స్ నెక్‌కు డోక్లామ్ కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉంది. గత యుద్ధంలో అరుణాచల్ ప్రదేశ్‌లో వేల చదరపు కిలోమీటర్లను ఆక్రమించిన చె%నా ఈ సారి చికెన్స్ నెక్‌పై దృష్టిపెడితే భారత్ చాలా భూభాగాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుంది.

దీంతో భారత్ దళాలు చైనా బలగాలను అడ్డగించాయి. ఇక్కడ మొదలైన ప్రతిష్టంభన నెలరోజులకుపైగా కొనసాగుతోంది. ఈ మధ్యలో చైనా బెదిరింపులు.. హుంకారాలతో హోరెత్తిస్తోంది. భారత్‌ను భయపెట్టేందుకు సరిహద్దులకు సమీపంలో పలుచోట్ల యుద్ధవిన్యాసాలను చేపట్టింది. దీంతో భారత్ కూడా దీన్ని సవాలుగా తీసుకొని దీటుగా బదులిచ్చేందుకు సిద్ధమవుతోంది.

**రక్షణ బలగాల బలోపేతం వేగవంతం..**

చైనా-పాక్‌లు భారత్‌కు ప్రధాన ముప్పుగా పరిణమించడంతో ఆయుధసంపత్తిపై మరింత దృష్టిపెట్టింది. ఇప్పటికే రక్షణ కొనుగోళ్లు, ఆయుధ అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలను ఆయా శాఖలకు బదిలీ చేస్తోంది. దీంతో త్వరితగతిన నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. జులైలో ప్రధాని మోదీ ఇజ్రాయిల్ పర్యటనతో 2015 నుంచి పెండింగ్‌లో ఉన్న హెరాన్ డ్రోన్ల కొనుగోలు ఒప్పందం ఓ కొలిక్కి వచ్చింది. దీంతోపాటు పలు రక్షణ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి.

ఇటీవల రష్యాలోని అలాబినో రేంజిలో జరిగిన 19 దేశాల సైనిక బలగాల పోటీల నుంచి భారత్‌కు చెందిన భీష్మ(టీ90) ట్యాంకులు ఇంజిన్ లీకేజీ కారణంగా అర్ధాంతరంగా వె%దొలగాల్సి వచ్చింది. ఇవే భారత్‌కు ప్రధాన ట్యాంక్ బలగం. దీంతో టి90 ఆధునికీకరణను వేగవంతం చేసింది. దీనికి మూడో తరం క్షిపణి వ్యవస్థను, ఆధునిక తుపాకులను, మరింత సమర్థవంతమైన ఇంజిన్‌ను అమర్చనున్నారు. ఈ బాధ్యతను, దీని ఆయుధ విడిభాగాల కొనుగోలు అధికారాలను ఆర్మీ డిప్యూటీ చీఫ్‌కు కట్టబెట్టింది. మరోపక్క భద్రతా దళాలకు ప్రత్యేక జాకెట్లు, బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లు సమకూరుస్తున్నారు.

భారత్ చైనా వాయుదళాల బలాబలాలు చూసుకుంటే హెలికాప్టర్ల విషయంలో భారత్ ముందంజలో ఉంది. దీనిని మరింత పటిష్టం చేసేందుకు అమెరికాలో తయారు చేసిన ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలు డీల్‌ను కూడా ఓకే చేసింది. దీంతో భారత వాయు దళం మరింత పటిష్టంగా మారనుంది.

**యుద్ధ సన్నద్ధత..**

భారత్-చైనా సరిహద్దుల్లోని ఈశాన్యరాష్ట్రాల్లో రవాణా వ్యవస్థ అత్యంత నాసిరకంగా ఉంది. ఇక్కడ మొత్తం కొండలు, గుట్టలతో ఉండటంతో నిర్మాణం కష్టసాధ్యంగా మారింది. దీనికి తోడు ఈశాన్య రాష్ట్రాలపై ఉన్న చిన్నచూపుతో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. అదే చైనా మాత్రం భారత సరిహద్దు వరకు బ్రహ్మాండమైన రోడ్లు, రైల్వే వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. ఇక్కడ భారత్ వె%పు వాహనాలు గంటకు 25-30 కిలోమీటర్ల వేగానికి మించి వెళ్లలేవు. కానీ చైనా వైపు వాహనాలు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే విధంగా రోడ్లు ఉన్నాయి. డొక్లామ్‌లో ఉద్రిక్తతలు మొదలు కాగానే చె%నా తన బలగాలను సరహద్దులోకి తరలించింది. లద్దాక్, టిబెట్, అరుణాచల్ ప్రదేశ్ , సిక్కిం సరిహద్దులను సైనికులతో నింపేసింది. యుద్ధానికి అవసరమైన ఆయుధాలు, ఆహారం తరలించింది. అదే సమయంలో అక్కడ ఏకంగా రక్తనిధి కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తుండటం భారత్‌ను కలవరపాటుకు గురిచేసింది. దీంతో కేంద్రం బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ నిర్వహణలోని 61 ప్రాజెక్టుల కింద ఉన్న 3,409 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంకల్పించింది. దీంతో బీఆర్‌వో డైరెక్టర్ జనరల్‌కు రూ.100 కోట్ల వరకు కొనుగోళ్లు చేసే అధికారాలను కట్టబెట్టింది. గతంలో డీజీకి రూ. 10.5 కోట్లు విలువైన పరికరాలు మాత్రమే కొనుగోలు చేసే అధికారం ఉంది. దీంతో ఈ ప్రాజెక్టులు మరింత వేగంగా ముందుకు కదిలే అవకాశం ఏర్పడింది.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com